# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | గురువారం 28-4-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 218 | పేజీలు:6 | వెల: రూ.1/-

**నమ్మలేని నిజాలు**

ఉన్నతపీఠం
కాసుల కానుకలు
తీరనిదాహం

కరవాళిక
నరంలేని నాలుక
తూచి మాటాడు.

చివరి ఆశ
సర్వజనసుఖదాం
ఆఖరి దారి.

రైతు లడాయి
సాగదోయి బడాయి
ధాన్యం కొనోయి.

నెత్తుటి డైరీ
పంచనామాలులేవు
నాజి సంతకం



– రేడియమ్
సెల్: 9291527757

**శ్రీనిజాలు**

రష్యా ఉక్రేయినులూ
రెండు మొండి ఘటాలు !
సింహ శార్దూలం జాతి
యుద్ధప్రీతి ముఠాలు !

అగ్రరాజ్యం అమెరికా
అది గుంటనక్క సాయం !
తుట్టతుదకు ప్రజలారా
మూడోయుద్ధం ఖాయం !



– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

## ఈ దేశంలో కొత్త రాజకీయ శక్తి అవసరం : సీఎం కేసీఆర్




హైదరాబాద్, ఏప్రిల్ 27:ఈ దేశం సరైన పద్ధతుల్లో ముందుకు పోవాలంటే.. రాజ్యాంగం ఉన్నది ఉన్నట్టుగా అమలు కావాలంటే, అంబేద్కర్ స్ఫూర్తి నిజం కావాలంటే, మౌలికమైనటువంటి మార్పులు చేర్పులు చేసుకుని అద్భుతమైన ప్రత్యామ్నాయ ఎజెండాతో, కొత్త రాజకీయ శక్తి ఈ దేశంలో ఆవిర్భవించాలి అని కేసీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ కోసం టీఆర్ఎస్ పుట్టినట్లే దేశం కోసం ఒక శక్తి తప్పకుండా పుడుతుంది. తెలంగాణ తరహాలోనే భూకంపం పుట్టించి– విద్రోహ శక్తులను తరిమికొడుదామని కేసీఆర్ పిలుపునిచ్చారు.

తెలంగాణ ప్రజల పక్షాన.. దేశ రాజకీయాలను ప్రభావితం చేయడానికి, గతిని, స్థితిని మార్చడానికి, దేశాన్ని సరైన ప్రగతి పంథాలో నడిపించడానికి హైదరాబాద్ వేదికగా కొత్త ఎజెండా, ప్రతిపాదన, సిద్ధాంతం తయారై దేశం నలుమూలల వ్యాపిస్తే ఈ దేశానికే గర్వకారణంగా ఉంటుందని కేసీఆర్ పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ రాజకీయ గుంపు కాదు.. కూటమి కాదు.. ప్రత్యామ్నాయ ఎజెండా ఈ దేశానికి కావాలి. ఆ దారులు వెతకాలి. నూతన వ్యవసాయ విధానం, నూతన ఆర్థిక విధానం, నూతన పారిశ్రామిక విధానం రావాలి. అందుకు అవసరమైన వేదికలు తయారు కావాలి. ఆ భారతదేశం లక్ష్యంగా పురోగమించాలి. సంకుచిత రాజకీయాలు వద్దు. దేశానికి అభ్యుదయ పథం కావాలి. అప్పుడే దేశం అద్భుతంగా బాగుపడతది. ఉజ్వలమైన భారత్ తయారవుతోంది అని కేసీఆర్ పేర్కొన్నారు.

**గవర్నర్ల వ్యవస్థపై ముఖ్యమంత్రి కేసీఆర్ ఫైర్**

దేశంలో గవర్నర్ల వ్యవస్థపై ముఖ్యమంత్రి కేసీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. గవర్నర్ల వ్యవస్థ సరిగా లేదని కేసీఆర్ తేల్చిచెప్పారు. దేశంలో కొందరు గలీజ్ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. టీఆర్ఎస్ ప్లీనరీ వేదికపై కేసీఆర్ మాట్లాడారు.

గవర్నర్ల వ్యవస్థ సరిగా లేదన్నారు కేసీఆర్. మహారాష్ట్ర ప్రభుత్వం 12 మంది ఎమ్మెల్సీల కోసం కేబినెట్ తీర్మానం చేసి పంపిస్తే ఒక ఏడాది పాటు ఆయన దగ్గర్నే పెట్టుకున్నాడు. తమిళనాడు అసెంబ్లీ బిల్లు పాస్ చేసి పంపిస్తే ఆ రాష్ట్ర గవర్నర్ వింత ధోరణితో ప్రవర్తించాడు. బెంగాల్, మహారాష్ట్ర, తమిళనాడు, కేరళలో గవర్నర్ల పంచాయితీ ఉందని సీఎం తెలిపారు.

**ఈ దేశం గుణపాఠం నేర్చుకోవాలి..**

ఎన్టీఆర్ పార్టీ పెట్టి ప్రజలకు మంచి పని చేయాలని భావించారు. యువకులుగా మేం నాడు పని చేశాం. 200 మంది ఎమ్మెల్యేలతో అధికారంలోకి వచ్చారు. ఇదే దుర్మార్గమైన గవర్నర్ల వ్యవస్థను వినియోగించి, స్వచ్ఛమైన పరిపాలన చేస్తున్న ఎన్టీఆర్‌ను పదవి నుంచి తొలగించారు. ఇదంతా మన కళ్లారా చూశాం. హైదరాబాద్‌లో జరిగిన చరిత్ర ఇది. నాడు ఉన్నటువంటి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇదే తెలుగు రాష్ట్రాల ప్రజలు మెడలు వంచి.. తిరిగి ఎన్టీఆర్‌ను అదే సింహాసనం మీద కూర్చొబెట్టారు. ఎన్టీఆర్‌తో దుర్మార్గంగా ప్రవర్తించిన ఆ గవర్నర్.. అవమానం పడి ఇక్కడ్నుంచి తొలగించబడ్డారు. దాన్నుంచి ఈ దేశం గుణపాఠం నేర్చుకోవాలి. కానీ దానికి వక్రమార్గంగా గవర్నర్ల వ్యవస్థ ఉందన్నారు కేసీఆర్.

**కొత్త రాజకీయ శక్తి ఆవిర్భవించాలి..**

ఈ దేశం సరైన పద్ధతుల్లో ముందుకు పోవాలంటే.. రాజ్యాంగం ఉన్నది ఉన్నట్టుగా అమలు కావాలంటే, అంబేద్కర్ స్ఫూర్తి నిజం కావాలంటే, మౌలికమైనటువంటి మార్పులు చేర్పులు చేసుకుని అద్భుతమైన ప్రత్యామ్నాయ ఎజెండాతో, కొత్త రాజకీయ శక్తి ఈ దేశంలో ఆవిర్భవించాలి అని కేసీఆర్ అన్నారు. తెలంగాణ కోసం టీఆర్ఎస్ పుట్టినట్లే దేశం కోసం ఒక శక్తి తప్పకుండా పుడుతుంది. తెలంగాణ తరహాలోనే భూకంపం పుట్టించి– విద్రోహ శక్తులను తరిమికొడుదామని కేసీఆర్ పిలుపునిచ్చారు.

## ఆత్మనిర్భర్ కాదు.. బతుకు దుర్భర్ భారత్ : మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, ఏప్రిల్ 27: బీజేపీ నేతలు ఆత్మనిర్భర్ భారత్ అంటారనీ.. కానీ బతుకు దుర్భర్ భారత్ అయ్యిందని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఆకలి సూచీల్లో మనం ఎక్కడో ఉన్నామనీ.. పాక్, బంగ్లాదేశ్ మనకన్నా ముందున్నాయనీ.. ఇది బీజేపీ పాలనా తీరని ధ్వజమెత్తారు. బుధవారం టీఆర్ఎస్ ప్లీనరీలో కేంద్ర ప్రభుత్వం సెస్‌ల రూపంలో వసూలు చేసే మొత్తాన్ని డివిజనల్ పూల్‌లోకి తేవాలని డిమాండ్ చేస్తూ తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానే రాదన్న తెలంగాణ సాధించి, దేశంలో ఆదర్శ రాష్ట్రంగా సీఎం కేసీఆర్ నిలపారన్నారు. 14 సంవత్సరాలు పోరాడి ఎత్తిన పిడికిలి దించకుండా రాష్ట్రాన్ని సాధించిన పార్టీ టీఆర్ఎస్ అనీ, దేశంలోనే అతిచిన్న వయసు కలిగిన రాష్ట్రమైనా అన్ని రాష్ట్రాలకు దశ–దిశ చూపిందన్నారు. సీఎం కేసీఆర్ రూపొందించిన ప్రగతిశీల ఎజెండా దేశానికి అవసరమని, పక్క రాష్ట్రాల నుంచి కేసీఆర్ ఎజెండా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారన్నారు.

**సీఎం ఆలోచనలతో గుణాత్మక మార్పునకు నాంది**

రైతుబంధు, దళితబంధు, ఉచిత కరెంటు, కల్యాణలక్ష్మి, మిషన్ భగీరథ తదితర పథకాలు మకు కావాలని పక్క రాష్ట్ర బీజేపీ నేతలు కోరుతున్నారని, సీఎం ఆలోచనలు, చిన్న పాలసీలు ఎన్నో గుణాత్మక మార్పునకు నాందిపలికాయన్నారు. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి అద్భుతమైన ఆలోచనతో స్థానిక సంస్థలను బలోపేతం చేసి, నిధులు, విధులు, ఉద్యోగాలు కల్పించి రూ.13వేల కోట్లు ఇస్తే దేశంలో సన్సద్ ఆదర్శ్ గ్రామ యోజన కింద పదికి పది తెలంగా గ్రామాలు మొదటి స్థానంలో ఉన్నాయంటే ఎంత అభివృద్ధి, ఎంత అద్భుత ఫలితాలు సాధించామన్నారు. గ్రామాలు బాగుపడితేనే రాష్ట్రం బాగుపడుతుందని ఆలోచించామన్నారు. కేంద ప్రభుత్వ సిద్ధాంతం ఏంటంటే.. 'కేంద్రం బలంగా ఉండాలి. రాష్ట్రాలు ఆర్థికంగా బలహీనంగా ఉండాలి. రాష్ట్రాలకు అధికారాలను తగ్గించాలి' ఇదే కేంద్రం సిద్ధాంతమన్నారు. రాష్ట్రాలు కేంద్రం చెప్పు చేతల్లో ఉండాలని చేస్తోన్న ప్రయత్నం ఇదని మండిపడ్డారు.

**బీజేపీ ప్రభుత్వానిది వైఫల్యాల చరిత్ర**

బీజేపీ ప్రభుత్వానిది వైఫల్యాల చరిత్ర అనీ, తెలంగాణ ప్రభుత్వానిది సాఫల్యాల చరిత్ర అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 24 గంటల ఉచిత విద్యుత్, పల్లె ప్రగతి, పట్టణ ప్రగతిలో సాధించిన అద్భుత ఫలితాలు, ధరణి పోర్టల్‌తో భూ సమస్యలు పరిష్కారమయ్యాయన్నారు. మల్లన్న సాగర్ ప్రాజెక్టు ప్రారంభించిన సమయంలో కానే కాదనీ, గోదావరి నీళ్లు రావన్నారన్నారని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ పట్టుబట్టి రాత్రింభవళ్లు పని చేస్తే కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి చేసుకొని నీళ్లు ఇస్తున్నామని, తెలంగాణ అంతా సస్యశ్యామలమైందన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడక ముందే 99లక్షల టన్నుల ధాన్యం పండితే ఇప్పుడు 2.50లక్షల టన్నుల దిగుబడి వస్తుందన్నారు. కేంద్రానికి వైఫల్యాల చరిత్ర అని మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం మాటలు మాట్లాడుతుందని, ఏడేళ్లలో దేశ ఆర్థిక వృద్ధి రేటుపడిపోయిందని, ఆ నాడు 8శాతం ఉంటే ఇవాళ 5.7శాతానికి పడిపోయిందన్నారు. బీజేపీ ధరలు పెంచి, మతకల్లోలాలు సృష్టించి ప్రజల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారని, అచ్చేదిన్ అన్నారు.. కానీ ప్రజలకు చచ్చేదిన్ చేశారని ఆరోపించారు. నల్లధనం తెస్తామని చెప్పి.. రైతాంగానికి నల్ల చట్టాలు తెచ్చారని విమర్శించారు.

**ఉద్యోగాలు ఊడగొడుతూ.. పరిశ్రమలు అమ్ముతున్నరు**

ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని ఊదరగొట్టారనీ.. ఇప్పుడు ఉద్యోగాలు ఇవ్వలేదు కానీ.. ఊడగొడుతున్నారని మండిపడ్డారు. కొత్త పరిశ్రమలు తెస్తామని చెప్పి.. ఉన్న వాటిని అమ్ముకుంటున్నారని, బీజేపీ ప్రభుత్వం అమ్మిన ప్రభుత్వరంగ సంస్థల విలువ మూడున్నరలక్షల కోట్లని పేర్కొన్నారు. మోదీ చాయ్ అమ్మిండని.. బుల్లెట్ ట్రైన్లు తెస్తామన్నారని.. కానీ వాస్తవానికి రైళ్లు, రైల్వేస్టేషన్లు జరుగుతున్నదన్నారు. బీజేపీ ప్రభుత్వం రాక ముందు నిరుద్యోగం 4.7 శాతం ఉంటే, ఏడేళ్ల బీజేపీ పాలనలో నిరుద్యోగం 7.11 శాతానికి పెరిగిందన్నారు. పేదల అకౌంట్లలో డబ్బులు వేస్తామన్నారనీ.. జన్‌ధన్ ఖాతాలన్నారని, కానీ రూపాయి పేదలకు ఇవ్వలేదన్నారు. రైతుల ఆదాయం డబుల్ చేస్తామని చెప్పి ఎరువుల ధరలు, డీజిల్ ధరలు పెంచారన్నారు. ఆదాయం పెరుగలేదని, పెట్టుబడి మాత్రం పెరిగేలా చేశారని విమర్శించారు. రైతుల ఉసురు పోసుకుంటున్నరి, బీజేపీ ప్రభుత్వం కార్మికులకు, ఉద్యోగులకు, కర్షకులకు, యువతకు, మహిళలకు, ఎస్సీలకు, ఎస్టీలకు, బీసీలకు ఏ వర్గానికి ఉపయోగపడిందని ప్రశ్నించారు. సంపద పెంచాలని, పేదలకు పెంచాలన్నది టీఆర్ఎస్ నినాదమన్నారు.

## కావాల్సింది కత్తుల కొట్లాటలు కాదు.. కరెంట్, సాగునీళ్లు : సీఎం కేసీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 27:దేశంలో మతం, కులం పేరిట రాజకీయాలు చేస్తున్న పార్టీలపై ముఖ్యమంత్రి కేసీఆర్ ధ్వజమెత్తారు. ఈ దేశానికి కావాల్సింది కత్తుల కొట్లాటలు, తుపాకుల చప్పుళ్లు కాదు.. కరెంట్, సాగునీరు, తాగునీరు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అని కేసీఆర్ స్పష్టం చేశారు. టీఆర్ఎస్ ప్లీనరీ వేదికగా సీఎం కేసీఆర్ ప్రసంగించారు.

జాతిపిత గాంధీని దూషణలు చేస్తున్నారు. ఏ దేశం కూడా ఇలాంటి దూషణలు చేయదు. ఇదేం దుర్మార్గం.. స్వాతంత్ర్యం కోసం వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేసి, జాతిపితగా పేరు తెచ్చుకున్న వ్యక్తిని దుర్భాషలాడటమా? ఆయనను చంపిన హంతకులను పూజించడమా? ఇది సంస్కృతా? ఇది పద్ధతా? ఎందుకు ఈ విద్వేషం. ఏం ఆశించి దీన్ని రగుల్చుతున్నారు. ఏ రకమైన మత పిచ్చి లేపుతున్నారు. మత విద్వేషాలు మంచిది కాదు. కుటిల రాజకీయాలు చేసి, పదవుల కోసం విధ్వంసం చేయడం తేలికనే. అదే కట్టాలంటే ఎంత శ్రమ అవసరం అని కేసీఆర్ ప్రశ్నించారు.

మన పొరుగు రాష్ట్రం కర్ణాటక రాజధాని బెంగళూరు సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియాగా పేరు సంపాదించిందని కేసీఆర్ గుర్తు చేశారు. అక్కడ 30 లక్షల మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలున్నాయి. పరోక్షంగా మరో 30 లక్షల మంది బతుకుతున్నారు. దీని వెనుకాల ఎంతో కృషి ఉంది. కానీ ఇటీవల కాలంలో హిజాబ్, హలాల్ జరుగుతుందీ ఆ రాష్ట్రంలో. కులం మతం పేరుతో దుర్మార్గపు రాజకీయాలు చేస్తున్నారు. అమెరికాలో మనోళ్లు 13 కోట్ల మంది ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వారు మీరు మా మతస్తులు, కులస్తులు కాదు అని పంపిస్తే ఈ కేంద్ర ప్రభుత్వం ఉద్యోగాలు ఇస్తదా? మత విద్వేషాలను రెచ్చగొట్టే ఈ దేశం ఉద్యోగాలను ఇస్తదా? ఇది ఎవరికీ మంచిది కాదు. దీని వల్ల ఏం సాధిస్తారు. దేశం అన్ని రంగాల్లో నాశనమై పోయింది. పోయినా సర్కారే మంచిగా ఉండే అని మాట్లాడుతు న్నారు. నిరుద్యోగం పెరిగింది. ఆకలి పెరిగింది. రైతులు ఇబ్బందుల్లో ఉన్నారు. నిత్యావసరల ధరలు పెరుగుతున్నాయి. వరిశ్రమలు మూతపడ్డాయి. ఇన్నీ సమస్యలతో దేశం సతమతమవుతుంటే.. దీనిపై దృష్టి పెట్టకుండా.. విద్వేషం, ద్వేషం ఒక పిచ్చి దేశానికి లేపి రాజకీయ పబ్బం గడుపుతున్నారని కేసీఆర్ మండిపడ్డారు.

పుల్వామా, సర్జికల్ స్ట్రైక్స్, కశ్మీర్ ఫైల్స్ అంటూ విద్వేషాలను రెచ్చగొడుతున్నారు. ఇదేమి దౌర్భాగ్యం. ప్రేమతో, అనురాగంతో. సోదరభావంతో ఉజ్వలమైన భారత్‌ను నిర్మించాలి. పిచ్చి కొట్లాటలతో నష్టపోతున్నామని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. దేశ రాజధానిలో దేవుని పేరుమీద జరిగే ఊరేగింపులో కత్తులు, తుపాకులతో చెలరేగిపోయారు. ఈ భారతదేశమేనా మనకు కావాల్సింది. మహాత్ముడు కలలగన్నది ఈ దేశమేనా? ఇదేనా ప్రజలు కోరుకునేది. కత్తుల కొట్లాటలు ఎవరికి కావాలి. కావాల్సింది కరెంట్, సాగునీరు, మంచినీళ్లు, ఉద్యోగాలు ఉపాధి అవకాశాలు. వాటన్నింటిని పక్కకు పెట్టేసి, మతం, కులం పేరుతో విద్వేషాలు రెచ్చగొడుతున్నారు. ఈ దేశం ఇట్లనే నాశనం కావాల్నా. లేదు టీఆర్ఎస్ గా మనం కూడా ఒక పాత్ర పోషించాల్నా? మన శక్తిని ప్రదర్శించి ఈ దుర్మార్గాన్ని నిలువరించి ఒక మార్గాన్ని చూపెట్టాల్నా.. ఇలాంటి ప్రశ్నలు మన ముందున్నాయని కేసీఆర్ తెలిపారు.

## లిథువేనియా లో భారతీయ మిషన్‌ను తెరవడానికి ఆమోదం తెలిపిన మంత్రిమండలి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27:లిథువేనియా లో 2022వ సంవత్సరం లో ఒక కొత్త భారతీయ మిషన్ ను తెరవడాని కి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షత న జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపింది

లిథువేనియా లో ఇండియన్ మిశన్ ను తెరిస్తే భారతదేశాని కి దౌత్యపరమైన ఉనికి ని విస్తరించుకోవడం లోను, రాజకీయ సంబంధాల ను మరియు వ్యూహాత్మక సహకారాన్ని బలపరచుకోవడం లోను, ద్వైపాక్షిక వ్యాపారం, పెట్టుబడి, ఇంకా ఆర్థిక కార్యకలాపాల తాలూకు వృద్ధి కి మార్గాన్ని సుగమం చేయడం లోను, ఉభయ దేశాల ప్రజల మధ్య సంబంధాలను మరింత బలపరచడం కోసం రంగాన్ని సిద్ధం చేయడం లోను, బహుపక్షీయ వేదికల లో మరింత నిలకడతనం తో కూడిన రాజకీయ సంబంధాల ను కొనసాగించడం కోసం అనుమతి ని ఇవ్వడంలోను మరియు భారతదేశ విదేశీ వ్యవహారాల విధానం యొక్క ఉద్దేశ్యాల కు సమర్థన ను కూడగట్టడం లోను అండదండలు లభిస్తాయి. లిథువేనియా లో ఏర్పాటు చేసే ఇండియన్ మిశన్ భారతీయ సముదాయాని కి మెరుగైన విధం గా సహాయాన్ని అందించడం తో పాటు వారి ప్రయోజనాల ను పరిరక్షించడాని కి కూడా తోడ్పడగలదు. లిథువేనియా లో ఒక కొత్త ఇండియన్ మిశన్ ను తెరవాలి అనేటటువంటి నిర్ణయం అభివృద్ధి తాలూకు మన జాతీయ ప్రాధాన్యం మరియు 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్' దిశ లో ఒక అగ్రగామి చర్య అని చెప్పవచ్చును. భారత దేశాని కి దౌత్యపరమైన ఉనికి ని విస్తరిం చుకోవడం అంటే అది ఇతర అంశాల తో పాటు గా, భారతీయ కంపెనీల కు విపణి లభ్యత ను సమకూర్చుతుంది; భారతీయ వస్తువులు, సేవల ఎగుమతుల కు దన్ను గా నిలుస్తుంది. ఇది 'ఆత్మనిర్భర్ భారత్' ను ఆవిష్కరించాలి అనేటటువంటి మన లక్ష్యాని కి అనుగుణం గా దేశీయ ఉత్పత్తి ని మరియు ఉపాధికల్పన ను పెంచడం లో దీని ప్రత్యక్ష ప్రభావం ప్రసరిస్తుంది అన్నమాట.

## ప్రజల హృదయాల్లో టీఆర్ఎస్‌కు సుస్థిరస్థానం: మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 27: టీఆర్ఎస్ 21వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి పార్టీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలిపారు. టీఆర్ఎస్ పార్టీ ఇంతితై వటుడింతై అన్నట్లు 2001 నుంచి నేటి వరకు 21 ఏండ్లుగా ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకుం దన్నారు.

తెలంగాణ రాష్ట్ర సమితి బలమైన సిద్ధాంత పార్టీగా పేరుగాంచిందన్నారు. ఉద్యమ నాయకుడు, సీఎం కేసీఆర్ సారథ్యంలో 21 ఏండ్ల ప్రస్థానంలో ఎన్నో విజయాలను కైవసం చేసుకున్న ఏకైక పార్టీ టీఆర్ఎస్ అన్నారు. ఉద్యమ ఆంకాంక్షలైన నీళ్లు, నిధులు, ఉద్యోగాలను సీఎం కేసీఆర్ సారథ్యంలో సాధించుకోవడం గర్వంగా ఉందని చెప్పారు. కేటీఆర్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి టీఆర్ఎస్ శ్రేణుల్లో మరింత ఉత్సాహం నిండిందన్నారు.

## పిల్లల వ్యాక్సినేషన్‌కు ప్రాధాన్యత ఇవ్వండి- సీఎంలతో కరోనా సమీక్షలో ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: పిల్లల వ్యాక్సినేషన్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్రాల ముఖ్యమంత్రులను ప్రధాని నరేంద్ర మోదీ కోరారు. దేశంలో మరోసారి కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో పలు రాష్ట్రాల సీఎంలతో బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. పలు రాష్ట్రాల్లో కరోనా కేసులు, పరిస్థితిని సమీక్షించారు. కరోనా సంక్షోభాన్ని పూర్తిగా అధిగమించలేదని హెచ్చరించారు. చాలా రోజుల తర్వాత స్కూళ్లు తెరుచుకున్నాయని, అయితే మళ్లీ కరోనా కేసులు పెరుగుతుండటంపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్న సంగతిని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో వ్యాక్సిన్ అర్హత ఉన్న పిల్లలందరికీ సాధ్యమైనంత త్వరగా టీకాలు వేయాలని, వారి టీకా కవరేజీకి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. దీని కోసం స్కూళ్లలో ప్రత్యేక టీకా శిబిరాలు నిర్వహించాలని, టీచర్లతోపాటు తల్లిదండ్రులకు దీని గురించి సమాచారం ఇవ్వాలన్నారు.

కాగా, ఇతర దేశాలతో పోల్చితే దేశంలో కరోనా సంక్షోభాన్ని బాగా నియంత్రించినట్లు ప్రధాని మోదీ తెలిపారు. అయితే మళ్లీ కొన్ని రాష్ట్రాల్లో కరోనా కేసుల పెరుగుదలను ప్రస్తుతం చూస్తున్నామని చెప్పారు. దీంతో కరోనా ఛాలెంజ్‌ను ఇంకా అధిగమించాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలో అలెర్ట్‌గా ఉండాలని, వైరస్ వ్యాప్తి నియంత్రణకు బహిరంగ ప్రదేశాల్లో తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.

## పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, సుకన్య సమృద్ధి యోజనపై అవగాహన సదస్సు

హైదరాబాద్, ఏప్రిల్ 27:పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, సుకన్య సమృద్ధి యోజన పై జె.ఎన్.టి.యు యూనివర్సిటీ ఆడిటోరియం లో 28.04.2022 రోజున 4:30 ఖ నుండి 07:30 ఖ వరకు సికింద్రాబాద్ పోస్టల్ డివిజన్ ఆధ్వర్యం లో అవగాహన కార్యక్రమం నిర్వహించబడుతోంది. ఈ కార్యక్రమం లో పాల్గొని పోస్టల్ శాఖ వారు అందిస్తోన్న వివిధ పథకాల గురించి అవగాహన పెంచుకోవాలని సికింద్రాబాద్ పోస్టల్ డివిజన్– సీనియర్ సూపరింటెండెంట్, గాంధీనగర్, హైదరాబాద్–500080 ఓ పత్రికా ప్రకటన లో తెలిపారు.

## వేసవి సెలవులను వృథా చేసుకోవద్దు : మంత్రి సబితా ఇంద్రారెడ్డి



హైదరాబాద్, ఏప్రిల్ 27: విద్యార్థులు వేసవి సెలవులను వృథా చేసుకోకుండా క్రీడలతో పాటు నచ్చిన అంశాల్లో శిక్షణ పొందాలని విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సూచించారు. బంజారాహిల్స్ రోడ్ నెం 3లోని యూబీఐ కాలనీ వెల్ఫేర్ అసోయేషన్ ఆధ్వర్యంలో పేద విద్యార్థుల కోసం నిర్వహించిన సమ్మర్ క్యాంపులో ప్రతిభ కనబర్చిన వారికి బుధవారం మంత్రి బహుమతులు అందజేశారు.

శ్రీనగర్ కాలనీలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ..వేసవి సెలవుల్లో సంగీతం, డ్యాన్స్, క్రాఫ్ట్, ఆటలు లేదా తమకు నచ్చిన ఇతర అంశాల్లో శిక్షణ పొందాలని సూచించారు. కార్యక్రమంలో యూబీఐ కాలనీ అధ్యక్షుడు నరేంద్ర చోప్రా,క్యాంపు నిర్వాహకులు యండమూరి గీత తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ అమరవీరుల స్థూపానికి సీఎం కేసీఆర్ నివాళులు

హైదరాబాద్, ఏప్రిల్ 27: టీఆర్ఎస్ పార్టీ ప్లీనరీ ప్రాంగణానికి ముఖ్యమంత్రి కేసీఆర్ చేరుకున్నారు. ప్లీనరీ సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన టీఆర్ఎస్ పార్టీ జెండాను సీఎం కేసీఆర్ ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ అమరవీరుల స్థూపానికి పుష్పాంజలి ఘటించారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు మహమూద్ అలీ, హరీశ్‌రావు తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, గువ్వల బాలరాజు, బాల్క సుమన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

**చరిత్రలో నేటినిజం**



కం॥ అద్దరికిని- ఇద్దరికిని
ఎద్దరికిని జేరని పర మేశుండనుచున్
సిద్ధపు పోటను గాలిచెడ
సద్దామ్హుస్సేను నటుని జన్మదినమునకో !!



(ఏప్రిల్ 28 సద్దాం హుస్సేన్ జన్మదినం..)

–రాధశ్రీ
సెల్: 9494481210

## కేసీఆర్ లాంటి టార్చ్ బేరర్ ఈ దేశానికి కావాలి : మంత్రి కేటీఆర్



హైదరాబాద్, ఏప్రిల్ 27: భిన్న మతాలు, భిన్న కులాలు, భిన్న వర్గాలు, భిన్న సంస్కృతుల సమహారంగా భారత్ ఉందని టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అందమైన పూలబోకేలా ఉన్న భారతదేశాన్ని కాపాడాలంటే కేసీఆర్ లాంటి టార్చ్ బేరర్ ఈ దేశానికి అవసరం అన్నారు. కేసీఆర్ భారతదేశ ప్రగతికి బంగారు బాటలు వేయాలని కోరుకుంటున్నానని కేటీఆర్ తెలిపారు. టీఆర్ఎస్ ప్లీనరీ వేదికగా కేటీఆర్ ప్రసంగించారు.

సబ్ కా సాత్ సబ్ కా వికాస్ అని మోదీ గొప్ప ప్రసంగాలు చేస్తారు.. కానీ మోదీ ప్రభుత్వంలో వికాస్ అన్నది వింత పదమైందని కేటీఆర్ విమర్శించారు. విద్వేషమే నాలుగు పాదాల మీద నుడుస్తోంది. సోషల్ మీడియా ద్వారా సోషల్ ఫ్యాబ్రిక్‌ను దెబ్బతీసే ప్రయత్నం జరుగుతోంది. ఒక నిర్మాణాత్మకమైన సంస్థలో ఒక కార్యకర్తగా, మీలో ఒకడిగా 75 ఏండ్ల స్వాతంత్ర్యం అనంతరం ఒక సగటు భారతీయుడిగా, ఒక తండ్రిగా భవిష్యత్ తరం గురించి ఆవేదనతో ఆందోళనతో రెండు మాటలు మనవి చేసుకుంటున్నానని కేటీఆర్ పేర్కొన్నారు.

**ఇంకో మతాన్ని కించపరచమని ఏ దేవుడు చెప్పిండు..?**

ఇంకా ఎన్ని రోజులు ఈ దేశం పేద దేశంగా ఉండాలి. కులపిచ్చి, మతపిచ్చి రేపే సంస్థల ఎజెండా, రెచ్చగొట్టే ఉద్వేగాలకు లోనవుదామా? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఒక మతానికి సంబంధించి జరిగిన ఊరేగింపులో ఇంకో మతాన్ని కించపరచమని ఏదేవుడు చెప్పిండు? నా పేరు చెప్పి కొట్టుకు చావండని ఏ దేవుడు చెప్పిండు? అని కేటీఆర్ ప్రశ్నించారు.

**ఆ నినాదాన్ని సాకారం చేసే నాయకుడిని ఈ దేశం కోరుకుంటోంది..**

1987లో చైనా, ఇండియా జీడీపీ పరిమాణం ఒక్కటే. కానీ ఈ రోజు మన జీడీపీ 3 ట్రిలియన్ డాలర్లు. చైనా 16 ట్రిలియన్ డాలర్లకుమన తలసరి ఆదాయం 1800 డాలర్లు ఉంటే.. చైనా 9 వేల డాలర్లకు ఎగబాకిందని కేటీఆర్ తెలిపారు. మేరా భరత్ మహాన్ అనే నినాదాన్ని సాకారం చేసే నాయకున్ని భారతదేశం కోరుకుంటోంది. ఆ నాయకుడిని తెలంగాణ అందిస్తుందని మనసారా ఆకాంక్షిస్తున్నానని కేటీఆర్ పేర్కొన్నారు.

**ఉద్వేగాల భారతం కాదు.. ఉద్యోగాల భారతం కావాలి..**

తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమం ఏడేండ్లలో సాధ్యమైనపుడు దేశంలో ఎందుకు సాధ్యం కాదని కేటీఆర్ ప్రశ్నించారు. ఉద్వేగాల భారతం కాదు.. ఉద్యోగాల భారతం కావాలి. వ్యవసాయ అనుకూల పథకాలు దేశమంతా అమలు కావాలి. డబుల్ ఇంజిన్ సర్కార్ కాదు.. గ్రోత్ ఇంజిన్ సర్కార్ కావాలి. గోల్‌మాల్ మోడల్, బుల్డోజర్ మోడల్, బిల్డప్ మోడల్ కాదు.. గోల్డెన్ తెలంగాణ మోడల్ దేశానికి పరిచయం కావాలని కేటీఆర్ పేర్కొన్నారు.

## ముగిసిన గోదావరి నదీ యాజమాన్య బోర్డు సమావేశం

హైదరాబాద్, ఏప్రిల్ 27:గోదావరి నదీ యాజమాన్య బోర్డు సమావేశం ముగిసింది. జలసౌధలో బోర్డు చైర్మన్ ఎంపీ సింగ్ ఆధ్వర్యంలో జరగ్గా.. తెలంగాణ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రజత్‌కుమార్, ఈఎన్సీ మురళీధర్‌రావు, ఓఎస్‌డీ దేశ్‌పాండే, ఏపీ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జవహర్‌రెడ్డి, ఈఎన్సీ నారాయణరెడ్డితో పాటు పలువురు అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గెజిట్ నోటిఫికేషన్ అమలు, బోర్డు నిర్వహణ, ప్రాజెక్టుల డీపీఆర్‌లపై తదితర అంశాలపై చర్చించారు. సమావేశం అనంతరం తెలంగాణ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రజత్‌కుమార్ మాట్లాడారు. చనకా, కొరాటా, చౌటుపల్లి హన్మంతురెడ్డి డీపీఆర్‌లపై చర్చించినట్లు పేర్కొన్నారు.

చిన్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకాలపై డీపీఆర్‌పై చర్చించామని, ఏపీకి చెందిన వెంకటనగరం పంప్‌హౌస్ డీపీఆర్, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు డీపీఆర్‌పై చర్చ జరిగిందన్నారు. తెలంగాణ ప్రాజెక్టులకు సంబంధించి అన్ని అనుమతులున్నాయని, ఇవాళ్టి సమావేశంలో ఏపీ నుంచి అభ్యరంతరం పెట్టారని పేర్కొన్నారు. ఏపీ అభ్యంతరాలను జీఆర్ఎంబీ చైర్మన్ తిరస్కరించారని, గెజిట్ నోటిఫికేషన్‌ను అభ్యయనం చేసి నివేదిక ఇస్తారన్నారు. గోదావరి నీటిని ఏపీ పట్టిసీమ ద్వారా కృష్ణా బేసిన్‌కు మళ్లిస్తోందని, గోదావరి జలాల్లో తెలంగాణకు 45 టీఎంసీల వాటా రావాలన్నారు. సీలేరు ప్రాజెక్టులో తెలంగాణ వాటాపై సైతం చర్చించినట్లు వివరించారు.

## రాష్ట్ర ఏర్పాటులో టీఆర్ఎస్ పాత్ర అద్వితీయం : ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, ఏప్రిల్ 27: తెలంగాణ రాష్ట్ర సమితి 21వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా టీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హార్థిక శుభాకాంక్షలు తెలిపారు. 2001లో టీఆర్ఎస్ పార్టీ పెట్టే నాటికి రాష్ట్ర సాధన కోసం చేసిన అనేక ప్రయత్నాలు విఫలమయ్యాయి. నిస్పృహలో ఉన్న తెలంగాణ సమాజాన్ని జాగృతం చేసి రాజకీయ ప్రక్రియ ద్వారా రాష్ట్రాన్ని సాధిస్తానని కేసీఆర్ ముందు అడుగు వేశారని కవిత గుర్తు చేశారు.

చిన్న రాష్ట్రాల ఆవిర్భావం అనే అంశం, దేశ రాజకీయాలు, జాతీయ పార్టీల మీద ఆధారపడి ఉన్న సమయంలో, తన రాజకీయ చతురతను ప్రదర్శించి, దేశంలోని వివిధ పార్టీల మద్దతును కేసీఆర్ కూడగట్టారని పేర్కొన్నారు. మొదటిసారిగా తెలంగాణ అంశాన్ని జాతీయ రాజకీయ ఎజెండాలో చేర్చి , రాష్ట్రపతి ప్రసంగంలో చెప్పించి, వివిధ పార్టీలతో జై తెలంగాణ అనిపించడానికి ప్రజా పోరాటాలను నిర్మించారని తెలిపారు. అంతిమంగా రాజకీయ ప్రక్రియ ద్వారా రాజ్యాంగ బద్ధంగా, శాంతియుతంగా, దేశ భౌగోళిక చిత్రపటాన్ని మారుస్తూ 29వ రాష్ట్రంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడడంలో టిఆర్ఎస్ పాత్ర అద్వితీయం అని కవిత ప్రశంసించారు.

రాష్ట్ర సాధనలో ప్రధాన కర్త, కర్మ, క్రియ అన్నీ కూడా మన ప్రియతమ నాయకులు ముఖ్యమంత్రి కేసీఆర్ అని కొనియాడారు. వారితో నడిచిన టీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా నిలిచిన తెలంగాణ ప్రజలు శుభాకాంక్షలు తెలిపారు. ఈరోజు మన గులాబీ జెండా, టీఆర్ఎస్ పార్టీ రెండు దశాబ్దాలు పూర్తి చేసుకొని 21వ వసంతంలోకి అడుగుపెడుతున్న క్షణాన ఆనందంగా ఉందన్నారు ఎమ్మెల్సీ కవిత.

## పార్క్ చేసిన బైక్‌లే టార్గెట్..వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడి అరెస్ట్

నిజామాబాద్, ఏప్రిల్ 27: పార్క్ చేసిన బైక్‌లే లక్ష్యంగా వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని పోసులు పట్టుకున్నారు. నిజామాబాద్ సీపీ నాగరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో వరుసగా వాహనాల చోరీలు జరుగుతున్నాయి. ఏడాది కాలంగా నిజామాబాద్, ఆర్మూర్‌తో పాటు ఇతర గ్రామీణ ప్రాంతాల్లో జన సంచారం లేని ఏరియాలో పార్క్ చేసిన వాహనాలు కనిపించకుండా పోతున్నాయి. ఈ విషయంలో పోలీసులకు ఫిర్యాదులు వెల్లువెత్తడంతో నిఘా ఏర్పాటు చేశామన్నారు. వాహన తనిఖీల్లో నిన్న అనుమానాస్పదంగా ఓ వ్యక్తి పోలీసులకు ఎదురు పడడంతో అదుపులోకి తీసుకుని విచారించగా వాహనాల దొంగతనం గుట్టు రట్టయింది. నిందితుడు శ్రీహరి నుంచి సుమారు పది లక్షల విలువ చేసే తొమ్మిది వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు సీపీ నాగరాజు తెలిపారు.

## బాల గేయం

బాలలు బడికి రావాలి
ఆడుతూ పాడుతూ చదవాలి
చక్కగా పాఠం వినరండి
హాయిగా మీరు ఉండండి.

బడి అంటే ఆట పాట
స్నేహితులతో కుస్తీలంట
అందరూ కలిసి తినండి
సంతోషంగా ఉండండి

బడి అంటే విజ్ఞానం
బడి అంటే ఆనందం
బడిలో ఉందు విరుల తోట
పిల్లలందరికి కనువిందంట.

భవితను దిద్దే బడి
పిల్లలకు మరో అమ్మ ఒడి
బడి అంటేనే గుడి
రోజు వస్తానీ పడి పడి.



-యాదవరం చంద్ర కాంత్ గౌడ్
9441762105

## కొత్త చిగురులు

అక్కడ –
రాలిన ఆకులు
చిగురించాలని చూస్తుంటాయి!
వాడిన బ్రతుకులు..
ఆశలను అమ్ము తుంటాయి!
రాత్రి కన్న కలలు
అలలుగా విరిగి పడుతూ..
యధావిధిగా..సదాజరిగే
జీవిత యాత్రను చేస్తుంటాయి!
అలసి సొలసినా..
తిరిగి బువ్వకోసం బయలు దేరి
మనుగడ కోసం..
ముందడుగు వేస్తాయి.!

తెల్లారకముందే –
నాలుగురోడ్ల కూడలి వద్దకో
నలుగురు నడిచే దారుల దరికో
తట్ట,బుట్టలను తలపై కెత్తుకొని
చిరు వ్యాపారస్తులు –
చిన్నగా చేరుకుంటారు.!
తిన్నగా తమ కష్టాన్ని..
ఇష్టంగా చేసుకుంటారు..!

అక్కడక్కడ –
కాయ గూరల్ని..కలగూర
గంపగా అమరుస్తారు.!
పూలు,పండ్లను..బొమ్మల
కొలువుగా తీర్చిదిద్దుతారు.!

బండెడు జీవితాన్ని
బల్ల రిక్షాలో వుంచి
పని భారంతో పడిలేస్తూ
కాలయంత్రంతో..
కదులు తుంటారు.!
అప్పుల బాధలతో
అడుగంటి పోతారు.!

సండే నాడు కూడా
మండే ఎండను తలపై
చుట్టుకుని..ధూళి దుమ్ము కమ్ము
కొస్తున్నా..చీడ పీడలు
వెంట బడుతున్నా..
వసంతాల తరబడి –

కాయ కష్టం చేసి..
కాయ గూరలతో పాటు..
తమ వయస్సును
పెంచేసు కుంటారు.!
తమ ఆయుస్సును
తగ్గించు కుంటారు.!

రోజులు తరబడి –
గిట్టని ధరలతో
తమను తామే
దండించు కుంటారు.!
కొనుగోలు దారుడు –
బేరసారా లాడినా..
బేషజం లేకుండా బేషరతుగ –
తమ శ్రమను చిల్లరగా మార్చి
చెప్పిన ధరను తగ్గించుకొని
అమ్మ మనుసుతో..
అమ్ము తుంటారు..!

అపుడప్పుడు –
మార్కెట్టు చేసే..
మాయాజాలంలో..
మునిగి పోతుంటారు.!
దళారీల దందాలో..
కుదేలై పోతుంటారు.!
అడ కత్తెరలోని..పోక చెక్కల్లా
నలిగి పోతుంటారు.!
అడగలేని పసి మనుసుల్లా
మిన్నకుండి పోతారు.!

ఏది ఏమైనా..ఏలిక ఎదైనా
వీరి బ్రతుకు పయనం –
ఒడు దుడుకులతో..
బరువెక్కుతునే వుంది
రోజువారీ వెతలతో..
వడలి పోతూనే వుంది
భద్రత కోసం..భవిత కోసం
ఎదురుచూస్తునే వుంది!

చిన్ని చిన్ని ఆశలతో కదిలే
ఈ చిరు వ్యాపారాలు –
చింతల్లేని జీవితాలుగా..
వెలిగే దెప్పుడో.!
కొత్త చిగురులు
వేసే దెన్నడో.!!



– బి. గోవర్ధన రావు
944196 8930

## నాకో చరిత్ర కావాలి

శతాబ్దాల క్రితం బూజుపట్టిన
చారిత్రక గ్రంథాలను ముందేసుకుని..
నా వారి ఉనికికై ప్రతి పేజీలో
నిశితంగా శోధిస్తున్నా..
కనుమరుగవుతున్న
వాస్తవాల నీడల నడుము
ఎక్కడైనా కనిపిస్తారని.

అంతమొందించిన వర్గాల జాడలు కొన్ని
దాసోహం అంటున్న కుహనా వర్గాలు కొన్ని
దొచుకునేందుకు దండెత్తిన వర్గాలు మరికొన్ని
వలస బాటలు పట్టిన శ్రామిక వర్గాలు..
అక్కడక్కడా కనిపిస్తున్నాయ్..

ఊరిలో నివాసాలు కొన్ని
ఊరి బయట జాగారం బ్రతుకులు కొన్ని
వెలివేసే ఉన్నత వర్గం ఒకవైపున...
వెలివేయబడిన అస్పృశత వర్గంలోని
పీడితులు మరోవైపు...

ప్రాణ త్యాగాల కుటుంబాలు కొన్ని
ప్రాణాలు తీసే పైశాచికత్వం ఉన్మాదుల
కవాతులు మరోవైపు....
నిత్య సంఘర్షణలు..రావణకాష్టం కోసం
మారణ హోమాలు..
ద్వేషాన్ని నింపుకున్న మతపిపాసులు.
మరొక వైపు..
కుల అహంకర భూస్వాములు ఒక వైపు.

ప్రతి పేజీలో ఏదో ఓ మరక.
మరకలేని చరిత్ర కావాలి నాకు
చదవాలి నేను..
నలుగురికి వినిపించాలి నేను..
తిరగేస్తున్నా ప్రతి పేజీ..
శోధిస్తూనే ఉన్నా..
కానీ!కానరాని నా జాతి ఉనికి..గురించి
ఎక్కడా ఒక్క వాక్యమైనా లేదే?



-రాము కోలా
9849001201

## నూతన క్రాంతి నిర్మిద్దాం

బంధాల మధ్య అపార్థాలు
అవమానాలు, గోడలపై
అంటిన మరకల లాంటివి.
వాటిని అనురాగం,
ఆప్యాయత అనే కొత్త
రంగులు అద్ది పూరించవచ్చు."
అవగాహన ఆర్ధత తో కడిగేయవచ్చు
బంధాలు అనుబంధాల

గోడల్లో రక్షించవచ్చు
మమత సమత తో
సంతోషాలను పండించ వచ్చు
శాంతి సహనం బహుమానాలతొ
సౌభ్రాతృత్వం సంఘిబావానికి
బాటలు వేద్దాం
సమాజములోనూతన క్రాంతిని నిర్మిద్దాం



-నేదునూరి కనకయ్య
9440245771

## పంజా విసిరిన రష్యా

యుద్ధాగ్నిజ్వాలలు ఎగిసాయి
నగరాల్ని భస్మీపటలం చేశాయి
జనం కకావికలై
తలోదిక్కుపారిపోయారు
ప్రక్కదేశాలలో
శరణార్థులయ్యారు
సైనికులు చివరిశ్వాస
వరకుపోరాడారు
క్షతగాత్రుల లెక్కలేదు
కట్టడాలు కూలిపోయాయి

జన నష్టం,ధన నష్టం
వాతావరణం కలుషితం
ఇదే యుద్ధ పరిణామం
పిచ్చుకమీద బ్రహ్మాస్త్రం
ప్రయోగించినట్లు
రష్యావంటి శక్తివంతమైన దేశం
ఉక్రేన్‌తో తలపడింది
ఈ యుద్ధం ఆపేవారెవరు
ఇలా జరుగుతుంటే
చిన్నదేశాలకు దిక్కెవరు?



-ఎస్ .ఎమ్ .షరీఫ్
9618045319

## సార్థకత

పక్షిలా ఎగురుట
నే నేర్చుకోలేను
చెట్టులా యిచ్చుట
నే నేర్వగలను !

మొక్కల్లే పువ్వులు
నేను కాపు కాయలేను
మొక్కలు ముచ్చటగా
పెంచి పూయించగలను!

గోవులా పాలిచ్చుట
నావల్ల కానే కాదు
అమ్మలా లాలించుట
నేను నేర్వగలను !

అడవిలో పులిలా ఊరిలో
క్రూరంగా నే బతకబోను
అయినా పులి వస్తే
ధైర్యంగ ఎదిరిస్తాను !

బడిలో పాఠాల సుగుణాలు
కథలలో నీతులు ఆచరణాలు
చందమామ వెన్నెల మనది
చల్లనిమనసుంటే సార్థకత మాది!!



-ఎల్. రాజా గణేష్,
9247483700

## యుద్ధం ఒక అనేక విధ్వంస దృశ్యాలు

యుద్ధం ఎపుడు విధ్వంసమే
విద్వేషాలే యుద్ధానికి మూల ధాతువులు .

ఆధిపత్యం పోరు ప్రాణాల్ని
ఛిద్రం చేస్తుంది .

అండ చూసుకొని ఒక చిన్న దేశం
అంగ బలం చూసుకొని ఒక పెద్ద దేశం
యుద్ధానికి తెరలేపాయి.

శూన్యాన్ని విధ్వంసం చేసి
ఆకాశాన్ని అల్లకల్లోలం చేసి
రక్తపు మడుగుల వాసన తో
యుద్ధం తడిసిపోతోంది.

నాటో వ్యూహాల మధ్య
దేశాల దేహాలు తగలబడిపోతున్నాయి.

ఇప్పుడు బతకడమంటే
మూడో ప్రపంచ యుద్ధమే.

దాహార్తులేవో
దేహాల్ని మింగుతున్నాయ్.

యుద్ధాలెపుడు సామాన్యుని
గుండె మీద తాండవం చేస్తాయ్ .
ఇప్పుడు ఉక్రెయిన్ , రష్యాల మధ్య
యుద్ధం ఒక అనేకానేక
విధ్వంసక దృశ్యాల్ని లేపి
సాదృశ్య పరుస్తున్నాయి .

ప్రాణాలు మట్టిరేణువులతో
చివరాఖరి ఘోషను
విన్నవిస్తున్నాయి .



-గవిడి శ్రీనివాస్
08886174458

## ఎలానమ్మా బతికేది ఈ లోకమునా..?

ఏమి చూపులమ్మ
ఈ లోకమునా
ఏమి మాటలమ్మ
ఈ జగమునా
కామపు చూపులతో
కర్కశపు మాటలతో
భరించేదేలనమ్మా
బతుకు సాగించేదేలనమ్మ.

బయటికెలితే చాలు
భయం గుప్పిట్లో బతుకు
ఇంటికచ్చు వరకు
ఇంట్లోల్లకుండదు కునుకు
ఏమి చేష్టలమ్మా
ఈ లోకమునా..!

ఏమి చూపులమ్మా
ఈ జగమునా...!!

అక్క చెల్లియని
వరుసలతో పిలుస్తరు
అదును చూసి
ప్రేమ నాటకమేస్తరు
ఒప్పుకుంటేనే సరి
లేకుంటే బతుకు బలి
ఎలా బతికేదమ్మా
ఈ లోకమునా..!
ఎలా జీవించేదమ్మా
ఈ జగమునా..!!

ర్యాగింగ్ ఆటలు
వికృత చేష్టలు
యాసిడ్ దాడులు
కత్తి వేటులు
ఎలానమ్మ వుండేది
ఈ లోకమునా..!

ఎలానమ్మా బతికేది
ఈ జగమునా..!!

మహిళను కొలచేటి
మన దేశంబునా
కరువాయేనా రక్షణ
పెంచుకోబట్టిరి కక్ష
మరెందుకో ఇంత వివక్ష
ఎలానమ్మా బ్రతికేది
ఈ లోకమునా..!
ఎలానమ్మా జీవించేది
ఈ జగమునా...!!



-పసుల.శంకర్
9542181301

కరోనా కథలు

## కరోనా వైరస్

గోపాల పురం అనే ఊరిలో ప్రసాద్ మరియు శాంత అనే ఇద్దరు భార్యభర్తలు ఉన్నారు. .వారికి కార్తీక్ , నవీన్ అనే ఇద్దరు కొడుకులు ఉన్నారు .పెద్ద కొడుకైన కార్తీక్ గొప్ప డాక్టర్ మరియు చిన్న కొడుకైన నవీన్ సామాన్య ఉపాధ్యాయుడు.వారు ఇద్దరు ఉద్యోగం చేస్తూ వారి అమ్మనాన్నలను చూస్తూ సంతోషంగా జీవిస్తున్నారు.

ఒకరోజు ఒక వ్యక్తి దగ్గు , జ్వరం తో కార్తీక్ హాస్పిటల్ లో చేరాడు.కార్తిక్ అతన్ని చూసి మామూలు దగ్గు అనుకోని మందులు ఇచ్చాడు.కానీ కొన్నిరోజులు గడిచినా దగ్గు , జ్వరం తగ్గకపోగ ఇంక ఎక్కువయింది. అది చూసి కార్తీక్ ఆశ్చర్యపోయాడు . ఎందుకని చాలా రోజులు గడిచినా తగ్గలేదు ? అంతేకాక కొన్ని రోజులలో ఒకరి తరువాత ఒకరికి ఎందుకు దగ్గు , జ్వరాలు వస్తున్నాయి . ఇది మమూలు దగ్గు , జ్వరమా లేదా ఏదైనా కారణం ఉందా అని అనుకొని దగ్గు జ్వరంతో బాధపడుతున్న వారిని జాగ్రత్తగా పరిశీలించి వారికి కరోనా వైరస్ ఉందని కనుగొంటాడు .

"ఈ కరోనా వైరస్ గురించి కొన్ని రోజుల క్రితం టి.వి లో చూసాను . ఇప్పుడు ఇక్కడ కూడా కఠిన వైరస్ వచ్చిందా ?ఇప్పుడు ఎలా గైనా ఈ వైరస్ ని అందరికి వ్యాపించకుండా ఆపాలి"

అని ఆలోచిస్తూ రాత్రి చాలా సమయం అవ్వడంతో అతను హాస్పిటల్ నుంచి ఇంటికి వెళ్లాడు.. అతను ఇంటికి వెళ్లినా కూడా తన గదిలో కూర్చొని కరోనా వైరస్ గురించే ఆలోచిస్తూ ఉన్నాడు . అతను ఆలోచిస్తూ ఉండటం అతని అమ్మ నాన్న గమనిస్తారు . కాని వారి భోజన సమయం అవ్వడంతో కార్తీక్ ను , నవీన భోజనానికి పిలుస్తుంది.. అందరు కలిసి భోజనం చేస్తూ ఉంటారు.

"నాన్న కార్తీక్ దేని గురించి నువ్వు ఎక్కువ ఆలోచిస్తున్నావు ? "అడిగింది శాంత

"అమ్మ ఈరోజు నేను ఒక విషయం కనుగొన్నాను. దాని గురించే ఆలోచిస్తున్నాను "

"ఏంటి ? ఆ విషయం కార్తీక్ "అని నాన్న అడుగుతాడు .

"నాన్నా.. కొన్ని రోజుల క్రితం కరోనా వైరస్ వచ్చి అనేక మంది చనిపోయిన విషయం విన్నాను .ఇప్పుడు అదే కరోనా వైరస్ మన దేశంలో రావడం కూడా కనుగొన్నాను. ఈ వైరస్ చాలా భయంకరమైన వైరస్ .ఎందుకంటే ఈ వైరస్ ఒకరి నుంచి ఒకరికి త్వరగా వ్యాపిస్తూ దాని వలన అనేక మంది ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉంది నాన్న , ఇక ముందు

ముందు ఈ వైరస్ ప్రభావం వలన ఏలాంటి ఆపద వస్తుందో, వైరస్ ముందు ఎటువంటి పరిస్థితులు ఎదురుకోవాల్సి వస్తుందో నని ఆలోచిస్తున్నాను " అన్నాడు కార్తీక్.

"అన్నయ్య, అసలు ఈ కఠిన వైరస్ ఎందుకు వస్తుంది అంటావు?

"అని నవీన్ అడిగాడు .

"ఇది జంతువులలో వచ్చింది . ఇప్పుడు ఈ వైరస్ మనుషులకి కూడా వస్తుంది"

"మరి కఠిన వైరస్ ఒకరి నుంచి ఒకరికి వ్యాపించకుండా అడ్డుపెట్టకుండా మార్గమే లేదా ? "

"ఈ వైరస్ ఒకరి నుంచి ఒకరికి వ్యాపించకుండ ఉండాలంటే అందరు ఇంట్లో నుంచి బయటికి రాకుండా ఉండాలి.అత్యవసర సమయంలోనే బయటికి వస్తూ ఒక వ్యక్తి మరో వ్యక్తికి ఒక రెండు మీటర్ల దూరంలో ఉండాలి. ఇది అందరు కలిసి పాటిస్తూ ఉండాలి. ఒక వ్యక్తి తుమ్మినా, దగ్గిన పక్కవారి మీద పడకుండా ఉండాలి. తప్పకుండా మాస్క్ ధరించాలి. ప్రతి ఒక్కరూ వీలైనంత వరకూ చేతులు సానిటైజర్ తో శుభ్రం చేసుకోవాలి. వారి ఇంట్లో బయట కూడా శుభ్రంగా ఉంచుకోవాలి. అంతే కాకుండా ఒకటే దగ్గర సమావేశం పెట్టకూడదు. ఎందుకంటే సమావేశం అయిన వారిలో ఒక్కరికీ వైరస్ ఉన్న అక్కడ ఉన్న అందరికి ఆ వైరస్ సోకే అవకాశం ఉంది. ఇది అందరు పాటిస్తూ ఉంటే ఈ వైరస్ ని అరికట్టగలుగుతాం ." చెప్పాడు కార్తీక్.

"అన్నయ్య, నేను ఉద్యోగం చేస్తూ ఖర్చులు పోగా మిగతా డబ్బులు దాచిపెడుతూ వస్తున్నాను . మీరు అనుకున్నట్లు అనుకోని పరిస్థితులు ఎదురుకోవాల్సి వస్తే ఆ సమయంలో నా దగ్గర ఉన్న డబ్బు మన ఇంట్లో ఉపయోగపడుతుంది . కాబట్టి మీరు మా గురించి ఆలోచించకుండా ప్రభుత్వం ద్వారా ఈ విషయాన్ని అందరికి తెలిసేలా చేసి కరోన వైరస్ అరికట్టడానికి మందు కనిపెట్టడానికి ప్రయత్నించండి . నేను కూడా మన చుట్టూ ప్రక్కల వారికి బందువులకి ఈ విషయాన్ని చెప్పి జాగ్రత్తగా ఉండమని చెప్తాను . ఒక సామాన్య ఉపాధ్యాయుడిగా నేను మీకు చేయగలిగింది ఏదైనా ఉంటే తప్పకుండా చేస్తాను "అని నవీన్ కార్తీక్ తో చెప్పాడు.

"బాబు, మీరు మాట్లాడుకునేది వింటే మాకు కూడా చాలా భయంగా ఉందిరా, కానీ మీరు అనుకున్న విధంగా కఠిన వైరస్ ని అరికట్టి ప్రతి ఒక్కరూ బాగుండాలని నేను కూడా కోరుకుంటున్నాను" అని వారి నాన్న విశ్వాసంతో అన్నాడు. అందరు కలిసి భోజనం చేసి నిద్రపోయారు.

మరుసటిరోజు నుండి కార్తీక్ కరోనా వైరస్ ను అరికట్టడానికి వ్యాక్సినేషన్ కనిపెట్టడానికి ప్రయత్నాలు ప్రారంభించాడు.



-కయ్యాల దీప్తి
9133624368

## తప్పుడు శిక్ష

చక్రి సుధ ఇద్దరు మిత్రులు ఇండియాలో బిటెక్ అయిపోగానే అమెరికాలో ఎమ్మెస్ చేయడానికెళ్లారు. చూస్తుండగానే మొదటి సెమిస్టర్ పరీక్షలు అయిపోయి ఓ వారం గడిచిందో లేదో,చైనా దేశంలో కరోనా వైరస్ వీరవిహారం చేస్తున్నదన్న వార్త ప్రపంచమంతా సునామీలా వ్యాపించింది. దీనితో పాటు ఆవ్యాధి కూడా పాకిపోయింది. ఈ వార్తలకు స్పందించిన అమెరికా తమ దేశంలోని విదేశీ విద్యార్థుందరినీ వారి వారి స్వదేశాలకు వెళ్ళిపోవాలని ఆదేశించింది.

అందులో భాగంగానే చక్రీ సుధా ఇద్దరూ ఫ్లైటులో ఇండియాకొచ్చేశారు. శంసాబాద్ ఏర్ పోర్టులో విమానం ల్యాండ్ అవగానే బయటకు వెళ్ళే ప్రయాణికులను కరోనా టెస్ట్ చేసిగానే పంపడం లేదు.

అప్పటికే టెస్ట్ కోసం వందల సంఖ్యలో జనం వరుసగట్టి నిలబడ్డారు. టెస్ట్ చేసిన వారిలో కొందరిని జాగ్రత్త కోసం 14 రోజుల క్వారంటైన్ వైపు మరి కొందరిని ఐశోలేషన్‌వైపు పంపతున్నారు.

ఈ విషయం దూరం నుంచే పసిగట్టిన చక్రి టాయిలెట్ నెపంతో వరుసలో నుండి తప్పుకున్నాడు. నిజాయితీగా ఉన్నఅమ్మాయి సుధ మాత్రం వ్యాధి లక్షణాలు లేకున్నా ముందుజాగ్రత్త కోసమని టెస్ట్ కాగానే క్వారంటన్‌కు తరలించారు.

పరీక్షించే తతంగం సద్దుమనగగానే అక్కడి సిబ్బంది కళ్లుగప్పి ఎలాగో ఏంచక్కా బయట పడి తమ ఇంటికి చేరుకున్నాడు చక్రి. ఇంటికెళ్ళిన తను ఎయిర్‌పోర్టు నుండి ఎలా తప్పించుకొని వచ్చాడో ఆ వివరాలన్నీ సంబరంగా చెప్పుకుంటూ జల్సాగా తిరిగాడు తన మిత్ర బృందంతో..

అప్పటికే ఓ వారం గడిచింది. జల్సాగా తిరగడం వల్లో ఏమో గాని జలుబూ జ్వరం వచ్చి బాధపడుతుంటే ఆర్ఎంపీ డాక్టర్‌కు చూయించి జలుబు మందులు తెచ్చుకుని వాడుతున్నాడు. అయినా దగ్గరపోయే సరికి క్వాలి ఫైడ్ డాక్టరుతో చెక్ చేయిస్తే ఈ జలుబుపై అనుమాన ముందని సివిల్ హాస్పిటల్‌కు సిఫారసు చేశాడు ఆ డాక్టర్. అక్కడిది కరోనా పాసిటివ్ అని తేలడంతో చక్రిని ఐసోలేషన్లోను, అతని కుటుంబ సభ్యుల్ని మరియు అతని సహచరులను మొత్తం క్వారంటైన్లో అడ్మిట్ చేశారు.

14 రోజుల క్వారెంటైన్లో ఉన్నసుధాకు ఎలాంటి వైరస్ లక్షణాలు లేవని ఆమెను ఇంటికి పంపించేశారు.

"చక్రి కోవిడ్–19 రోగంతో హాస్పిటల్లో చికిత్స పొందుతున్నాడు" అని సుధకు తెలిసింది. అప్పుడనిపించింది సుధకు "చక్రి కూడా తనలాగే క్యూలో నిలబడి ఉంటే క్వారెంటైన్‌లో చికిత్స పొంది ఉంటే వాడుకదా! అతనికి ఇంతటి ముప్పు వచ్చేది కాదు కదా తప్పుడు శిక్ష అనుభవిస్తున్నాడు" అని.

అందుకే జీవితంలో తాత్కలిక ఆనందాలకు ఎప్పుడూ తప్పు చేయరాదని, ఆరోగ్య విషయాన్ని ఎప్పుడూ దాయకూడదనీ, అంతేకాదు

'తాచెడ్డ కోతి వన మెల్ల చేరిచే"అన్నట్లు చక్రి తాను ఆపదలో పడ్డదే కాక తనవారి నందరినీ ఆపదలో పడేశాడు కదా! అందుకే జ్యాదా హుష్యారీ పనికి రాదంటారు పెద్దలు అందుకనేమో.



-దారం గంగాధర్
సెల్:9848384777

## తెరిచిన కిటికీ !!

దర్వాజా అంత పెద్దది కాకున్న
మనసు తెరుచుకున్నట్లు రాజగవాక్షం కిటికీ !

తెల్లారితే కిటికీ సూర్యబింబం
చెట్లు ఊగితే గది నిండా గాలే గాలి
వర్షం పడుతుంటే గది వాన మబ్బుకు
జల్లు కొట్టిన ఆట స్థలం
పున్నమకైతే గదిలో ఆకాశమంత
వెన్నెల దర్బారు !
వరంగా హృదయ కమలం విప్పారి
మానస సరోవరం
ఎవరైనా కిటికీ మూస్తే

పగలైనా రాత్రి అయినట్లే
భ్రాంతిమద అలంకారం !
రెప్పలూ చీదరించుకుంటాయి!
కలం ఆడుతున్నదంటే కిటికీ బలమే
అన్ని ఋతువులూ తెరిచిన
కిటికీకి ఫ్రేము కట్టినట్టే !
కిటికీలోంచి చూస్తే
సమయం చెప్పకుండానే తెలిసిపోతుంది !
కిటికీ అంకెల భేషజం లేని పెద్ద గడియారం

కిటికీ shut sesame కాదు
ఎప్పటికీ open sesame



– కందాళై రాఘవాచార్య
8790593638

## మనసును పట్టే మనిషి ఆలోచనలు

నీ ఆలోచనల స్వభావం
నీలో ప్రశాంతతకు కొలమానం.
నీ మనోవైకల్యత నీ ఆందొలనకు పునాది
మనంఆరోగ్యంగా వుండాలంటే
మంచి ఆలోచనలే దాని రహస్యం.
వేరు బాగుంటేనే చెట్టు బాగుంటుంది.
మనసు బాగుంటేనే మనిషి బాగుంటాడు.
మనిషి మాటవ్యక్తిత్వానికి మూట
మంచి తనమే నీ చిరునామ
నీ ఆందోళన లు నీ మానసిక
దౌర్బల్యతకు ప్రతిబింభం
ప్రతి ఒక్కరిని మీరు అనుకున్న తీరులోకి
మార్చాలని అనుకోవద్దు.
ఎదుటి వాళ్ళని
అలాగే అంగీకరించడం మంచిది.
అంగీకరించిన మారని మనుష్యులను
వదులుకోవడం
మనసుకు మంచిది
మనశ్శాంతి కిమంచి మార్గం"
కలహాలు కపటాలు మానుకొని
స్నేహం సహనం సమన్వయం
అవగాహనా చైతన్యం ఆత్మగౌరవం
ఆలంబనగా జీవిద్దాం
మంచిలోమానవీయత లో
చిరంజీవులుగ నిలుద్దాం
విలువలే జీవన శైలిగా జీవిద్దాం

-నేదునూరి కనకయ్య
9440245771

## కులతత్వం, మతతత్వంపై యుద్ధం చేయాలి



తెలంగాణ నేల కుల అధిపత్యాన్ని, మత ఆధిపత్యాన్ని సహించదని తెలంగాణ సాహిత్య అకాడమీ ఛైర్మన్ జూలూరు గౌరీశంకర్ అన్నారు. గంగా, యమున, తెహజీబ్‌లా వర్ధిల్లిన తెలంగాణ నేలపై రగులుతున్న మత విద్వేషాలపై తెలంగాణ కవులు యుద్ధం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ సాహితీ ప్రధాన కార్యదర్శి కె. ఆనందాచారి రచించిన ఇక ఇప్పుడు కవితా సంకలనం పుస్తకావిష్కరణ జరిగింది. కవి యాకూబ్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి కె. శివారెడ్డి హాజరై సంకలనాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నందిని సిధారెడ్డి, తెలకపల్లి రవి, బన్న ఐలయ్య, సీతారాం, డాక్టర్ ఎస్.రఘు, నస్రీన్‌ఖాన్, స్ఫూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## జ్ఞాపకాల పుస్తకం జీవితమంటే

ఇది నాది అది నాది అంటాడు నరుడు
నీదంటూ ఉందంటే అది వల్లకాడు
నీ ధనము రాదు బలగము రాదు
పగిలేటి కుండతో నీ రుణము తీరు.

అన్నదమ్ములు రారు ఆడబిడ్డలు కారు
ఆస్తులు నీవి కావు అయినవాళ్లుండరు
ప్రేమతో నువు చూసే నీవాల్లెవరు రారు
ఆరడుగుల భూమే నీకున్న సౌధము.

నీ వాల్లెందరున్న కాష్టం వరకే
కన్నీళ్లు కార్చేది శవము కాల్చేటి వరకే
నీకెంత పేరున్న నీతోటి రాదు
నీ చివరి చిరునామా బొందలగడ్డే!

ఆఖరకు మిగిలేది నువు చేసే మంచే
జ్ఞాపకాల పుస్తకం జీవితమంటే
ఉన్నన్ని రోజులు న్యాయంగా బ్రతుకు
నాది నీదనకుండ ధర్మంగా బ్రతుకు.



-బొల్లం బాలకృష్ణ
సెల్:9989735216

## విజయాల నిచ్చెన

ఓటమికి భయపడకు,

అపజయానికి కృంగిపోకు
దరి చేరినపుడు భాదపడకు
నిర్విరామ ప్రయాణంలో
అపజయం స్పీడ్ బ్రేకరే,
కమనీయ కథాయానంలో
మధ్యలో వచ్చే " , " లాంటి
చిన్న విరామం మాత్రమే!

ఓటమి అనుభవ ఆచారి
ఓర్పుతో పాఠం నేర్పే గురువు
ఎంత బలంగా నేలకు కొడితే,
తటాలున ? అంత పైకెగిరినట్టు...
ఎంత అదిమి పడితే
అంత విస్తరించినట్టు ?

అనంత సాగరానికి సైతం
ఎడతెగని ఆటుపోట్లు
ఒక్క రోజులో విజయం దరిచేరదు

సూర్య కిరణాలను మబ్బులు
ఎంతకాలమని అడ్డుకుంటాయి?
కాలం నిన్నొకమారు
ఆప్యాయంగా పరామర్శిస్తుంది

సమయపాలన, ఖచ్చితత్వం,
మెరుపులాంటి ఆలోచన,
మేటైన ప్రణాళిక, ధీటైన ప్రహేళిక
సాధించగలమనే సంకల్పం,
విరామమెరుగని శ్రమ,
విజయగాథల స్ఫూర్తి మంత్రం!

నేర్చుకో...
విరామమెరుగని విద్యార్థిలా
పేర్చుకో...
విజయాల నిచ్చెనకు
ఒక్కొక్క మెట్టులా
అలవర్చుకో...
వెనకడుగేయని నైజం
సాగించు నీ పయనం
ఆకాశమే హద్దుగా...



-గంగాపురం శ్రీనివాస్
9676305949

## విషాదగీతం వినిపించకు

పురాతన వీధిలో నుంచి నన్ను పిలవకు
భాదలో మునిగిన విషాద గీతం వినిపించకు
అశ్రుపూరితమైన కవిత వినిపించకు
విరిగిన మనసును ఇంకా విరగగొట్టకు

గతించిన దినాల జ్ఞాపకాలలో
పురాతనమైన రాగాన్ని నేను మరిచాను
ఒక క్రొత్త మజిలీకి నేను చేరుకున్నాను
పాత ఉనికి నేను మరిచాను
ఆ పురాతన హృదాయాన్ని విడిచాను
ఆ పురాతన ధర్మాన్ని విడిచాను
పాప ప్రక్షాళన చేసుకున్నాను

పురాతన బంధనాలు తెగిపోయాయి
ఏ సంకెళ్లు నా కాళ్లకు లేవు
అద్దం లాంటి మనసులో ఏ బొమ్మ లేదు
అన్నిటినుంచి విముక్తి పొందాను

జీవితం మారిపోయింది
ప్రపంచం మారిపోయింది
మనసుకు విలువైన జ్ఞానిధి దొరికింది
నాలో నాకే క్రొత్త మనిషి ఆవిష్కరించాడు
క్రొత్త దారిలో పయనం కొనసాగిస్తున్నాను
మలినం కడిగేసుకున్నాను
శాంతి మంత్రం జపిస్తున్నాను
ఇపుడు నాకు నేనే క్రొత్త గా కనిపిస్తున్నాను



-అరుణ దేనియల్
9000606889

## నీరు-వృథా చేస్తే కన్నీరు

నీరు ప్రాణ కోటికి జీవనాధారం
ప్రకృతి వనరుల్లో అతి ముఖ్యం
పంచభూతాల్లో అత్యంత ప్రధానం
జీవకోటి మనగడకు ఆధారం
భూలోకంపై ప్రాణకోటి వృద్ధికి
జీవన ఆధారం
ఆహారంగా మానవాళికి ఒక అద్భుత వరం
ఈ నీరే లేకుంటే మానవ మనుగడే ప్రశ్నర్థకం
కానీ, మేము చేస్తున్న తప్పులే
నిన్ను చేస్తున్నాయి మాకు దూరం -దూరం
ఇక మేము చేపట్టాలి నీటి పొదుపుకు శ్రీకారం
లేకుంటే భవిష్యత్ తరాలకు
మిగులు అంధకారం

నీటి పొదుపే భవితకు మార్గం
ఆదమరిస్తే కలుగును శోకం
కనుచూపు మేరలో పొంచి వుంది ప్రమాదం
అవసరం మేర వాడుకుంటేనే పురోగమనం
పాటించాలి ఇక నీటి పొదుపు సూత్రం
ఇక నీటి నిల్వలకు కట్టాలి శ్రీకారం
అడపాదడపా కట్టాలి ప్రాజెక్టు చెక్ డ్యాం
వృధా నీటికి వేయాలి కళ్లెం!
అనవసరంగా వాడుకుంటుంటే
అవసరాలకు అక్కరకు రాకుండా
పోవునన్నదినిజం..
ఇది గ్రహించాలి మనమందరం!
భవిష్యత్ తరాలకు కల్గించొద్దు శోకం!!



-ఎన్.. రాజేష్
9849335757

## నీటి చుక్క

చిటపట చిటపట చినుకుల చిందులు
చినుకు చినుకు కలిసి ముత్యమై
మెరియు చిగురాకు చివరన
చివరన చేరిన నీటి బొట్టు
చటుక్కున చేరి వాగున
ప్రవహించు శిల్ప సుందరిలా
వాగువంక నిండిన నాడు పైరు పంటలు
పచ్చగా నుండును
రవి వేడికి కలతచెంది
నీరు ఆవిరి రూపాన నింగికి ఎగిసి
మారును మేఘంలా పచ్చని చెట్టు
చల్లని పలకరింపుతో పులకరించి

తిరిగి వర్షించిన వానచినుకును ముద్దాడు
పుడమి మురిపెంగా నేడు
ఆ పుడమి ఉష్ణ తలము అయి
నీటి చుక్కను చేస్తోంది మటుమాయం
తరచి చూడ ఇది మానవ తప్పిదం
ఒడిసిపట్టు నీటి చుక్కను
దూరముందు పాలిథిన్ కవరులకు తరిమి
వేయు కాలుష్యభూతాలను వారధిగా నిలచి
పో భావితరానికి అందించు నీటిని
ప్రకృతివరంగా రేపటి తరానికి జీవధారగా



-సి. హేమలత
9666779103

## జేజేలు

లాలించే అమ్మకు జేజేలు
పాలించే నాన్నకు జేజేలు

ఆడించే అన్నకు జేజేలు
పాడించే అక్కకు జేజేలు

బువ్వ పెట్టే అవ్వకు జేజేలు
కథలు చెప్పే తాతకు జేజేలు

బొమ్మలిచ్చే బాబాయికి జేజేలు
ప్రేమను పంచే పిన్నికి జేజేలు

ఆహారాన్నిచ్చే మొక్కకు జేజేలు
వానిచ్చే మేఘానికి జేజేలు

జోలపాడే వెన్నెలకు జేజేలు
హాయినిచ్చే గాలికి జేజేలు

పండించే రైతుకు జేజేలు
చదువు చెప్పే గురువుకు జేజేలు



-కయ్యూరు బాలసుబ్రమణ్యం
9441791239

## నీడ..నువ్వు

తన నీడను నమ్మని వాడు
నిన్నెలా నమ్ముతాడు?
తన నుంచి ఏర్పడిన నీడ
తనకు తోడనుకున్నవాడు
అది పొద్దునుబట్టి మారుతున్నప్పుడు
చీకట్లో కలిసి పోయి
అస్తిత్వం కోల్పోతున్నప్పుడు
ఎలా నమ్ముతాడు?
తన నీడను నమ్మని వాడు
నిన్నెలా నమ్ముతాడు?

నువ్వు పరాయివి
మంచి చేస్తావో..
ముంచుతావో తెలియదు
నమ్మి మోసపోవడం కన్నా
నమ్మకపోవడమే మంచిదనుకున్నాడేమో?
అందుకే..
తన నీడను నమ్మని వాడు
నిన్నెలా నమ్ముతాడు?.



-ప్రతాప వెంకట సుబ్బారాయుడు
9393981918

## నాలుగు

అంకె నాలుగు
నలుగురిని కలిపినా
రెండు + రెండుని
నాలుగు చేసినా
నలుగురితో నాలుగు అడుగులు వేసినా
అంకె నాలుగే.
కళ్లు కలుసుకున్నప్పుడు
పెదవులు గాఢంగా ముద్రలు
వేసుకొంటున్నప్పుడూ
నాలుగే.
ఒకరిని ఒకరు హత్తుకొని
గుండె చప్పుడు వినాలనుకొన్నప్పుడు
చేతులను దండలుగా మార్చి
మెడలో అలంకరించుకొన్నప్పుడూ
ఆ నాలుగే.
కాని ఇద్దరిని
దూర దూరంగా నిలబెట్టి
విడదీస్తే
బాధపడేవి రెండు హృదయాలు
ఇక్కడే అంకె కుదరదు
లెక్క తప్పు తేలుతుంది.
విడిపోయి రోదిస్తున్నప్పుడు
ఆ నాలుగు కళ్లు వర్షిస్తాయిగా
మళ్లీ లెక్క సరిపోతుంది
నాలుగు అంకె
సరిగ్గా ఇమిడిపోతుంది..



– రేణుక అయోల
సెల్: 9963889298

## జీవం-జీవాత్మ

నోరెరుగని మూగజీవాలకు
ఆపద్బాంధవులు, ఆత్మ బంధువులు
ప్రకృతిమాత– భూమాతలే
జంతువుల కాన్పులకు ఆసుపత్రులు లేవు పురిటి
నొప్పులకు ఓదార్చే వారు లేదు
డాక్టర్లు, ఆయాలు లేరు
భూమ్మీద పడిన పసికూనలకు
రక్తపు మరకలు కడిగే వారులేరు.
ప్రకృతి వీచే గాలే పంఖాలై
నెత్తురు ఆరిపోయిన జీవాలకు
భూమాత ఒడే మెత్తని పరుపులు
తల్లిపాలు చాలకున్నా
పాలుతాగించే వారులేరు.
వరుణుడిచ్చిన నీరుతాగుతూ
అందరికి పాలు, మాంసం ఇస్తూ
చెట్లనీడలే భవంతులయి
మనుష్యులు పట్టించుకోకున్నా
మన మధ్యే తిరుగుతూ
మన భూములు దున్నుతూ
మనకు ఎరువులనిస్తూ
చనిపోయినా చర్మాన్ని ఒలిచి
చెప్పులు ఇస్తూ
ఆదాయాలు కల్గిస్తూ
కాళ్ళకు నాడాలు కొట్టినా
మనం స్వారీ చేస్తే పరుగెత్తే గుఱ్ఱాలు
కుందేళ్లు, లేళ్లు, జింకలు, పరుగులు
వినోదాన్ని కల్గిస్తూ, జీవనభృతిని కల్గిస్తూ
మాంసం అందిస్తూ
పట్టెడన్నం పెడితే విశ్వాసంతో
యజమానికి సేవచేసే శునకరాజాలు.
కోడికూతతో పల్లెను మేల్కొలిపి
గ్రుడ్లతో సహా వారికే ఆహారమయి
చిలుకపలుకులు,
ఉత్తరాలు మోసే పావురాలు
రాయబారాల హంసలు, రకరకాల పక్షులు
ఐకమత్యంతో మెలిగే కాకులు
మయూరాల నృత్యాలు
పార్కుల్లో బంధింపబడి అయినా
మనకు వినోదాన్ని కల్గిస్తున్నాయి.
మన హృదయాలలో
తెలియని ఆనందం కల్గిస్తున్నాయి
ఈ జంతువులకు, పక్షులకు
మనమేమిచ్చి ఋణం తీర్చుకోగలము
వీటన్నటికి సేవ చేయలేకున్నా
వాటి మూగభాష ప్రబోధంతో
మానవజాతి జాగృతం కావాలి
జంతువులను, పక్షులను కాపాడుకోవాలి
ప్రకృతి, ఆకాశం, చెట్లు, భూమి
వరుణుడు, వాయువు అగ్ని
వాటిని కాపాడుతున్నాయి
హింసించడం మాని
మనం వాటిని కాపాడుదాం.



– వై.సుగుణాదేవి
సెల్:9010480955

# సహృదయ కవిత్వ విమర్శతో..."శతారం"..!

పుస్తక సమీక్ష





కవిత్వం, సమీక్ష, విమర్శ, కథా ప్రక్రియల్లో దాదాపు గత మూడు దశాబ్దాలుగా తమ సృజనాత్మక ప్రతిభతో సాహితీ లోకంలో అందరి దృష్టినాకర్షిస్తున్న కవి, రచయిత గోపగాని రవీందర్ గారు తమ పూర్వాశ్రమంలో జర్నలిస్టు.. ప్రస్తుతం వృత్తిరీత్యా ఉపాధ్యాయులు.. రచనా వ్యాసంగాన్ని ప్రవృత్తిగా మలచుకుని.. నిరంతర సాహితీ కృషీవలుడుగా వెలుగొందుతున్న గోపగాని గారు నాలుగు కవితా సంపుటాలు.. రెండు వ్యాస సంపుటాలను ఇదివరకే వెలువరించారు.. సానుకూల దృక్పథం... సహృదయత వంటి సద్గుణాలను సొంతం చేసుకున్న ఆయన.. 'అంకురం', 'చెరగని సంతకం', 'దూరమెంతైన', 'చిగురు' వంటి కవితా సంపుటాలను ప్రకటించి కవన రంగంలో ఓ కవిగా తమకంటూ ఓ స్థానాన్ని పదిల పరుచుకున్నారు.. "నేలమ్మ నేలమ్మ" అంటూ రాసిన సుద్దాల అశోక్‌తేజ గారి గేయాలపై ఓ పరిశీలనా గ్రంథాన్ని, నికి తావివ్వకుండా.. ఇందలి రచనకు జీవం పోశాననీ.. "శతారం" అంటే వజ్రాయుధం.. అని అందరికీ తెలుసనీ.. ఆ ఆయుధానికి ఎంత శక్తి ఉందో.. కవులు.. రచయితల కలాలకు అంతే శక్తి ఉందన్న భావంతో "శతారం" నామకరణం చేయడం జరిగిందని రచయిత గోపగాని గారు తమ ముందుమాటలో సవినయంగా ప్రకటించుకున్నారు.

'శతారం'లోని వ్యాసాలు ఇదివరకే వివిధ పత్రికల్లో ప్రచురితమైనవి.. ఆకాశవాణిలో ప్రసారమైనవి కావడం విశేషం..

తెలుగు సాహిత్యాన్ని ప్రభావితం చేసిన విప్లవ, అభ్యుదయ, దళిత, బహుజన, అస్తిత్వ పోరాటాల సాహిత్యాన్ని విస్తృతంగా అధ్యయనం చేసిన ఆయన తమ కవిత్వ విమర్శనా వ్యాసాలకు ఎంపిక చేసుకున్న కవితలు చాలావరకు అవే కావడం గమనార్హం! ఏ సిద్ధాంతాల లోతుల్లోకి వెళ్లక పోయినప్పటికీ.. మానవీయ కోణంలో పరిశీలిస్తూ ఇందలి వ్యాసాలను రూపుదిద్దినప్పటికీ.. అక్కడక్కడ ఆయన పుణికి

> "ఏ సిద్ధాంతాల లోతుల్లోకి వెళ్లక పోయినప్పటికీ.. మానవీయ కోణంలో పరిశీలిస్తూ ఇందలి వ్యాసాలను రూపుదిద్దినప్పటికీ.. అక్కడక్కడ ఆయన పుణికి పుచ్చుకున్న అభ్యుదయ, ప్రగతిశీల భావధార మనకు కానవస్తుంది"

తెలంగాణ కథా విశిష్టతను చాటేందుకు "తెలంగాణ కథకుల కథాంతరంగం" పేరుతో కథా విమర్శనా వ్యాసాలను ప్రకటించిన అనుభవం ఆయనకు ఉంది, ఆయన ఎక్కడున్నా.. సాహితీ వాతావరణాన్ని నిర్మాణం చేసి.. ఆ ప్రాంత సృజనకారులను ప్రోత్సహించే ప్రయత్నం చేయడం ప్రశంసనీయం..

వివిధ సాహితీ సంస్థల్లో క్రియాశీలక బాధ్యతలను నిర్వహిస్తూ.. సాహిత్య చైతన్యానికి కృషి చేసే ఉత్తమ లక్షణమున్న ఆయన తెలంగాణ రచయితల వేదిక కార్యదర్శిగా ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా శాఖకు విశిష్టమైన సేవలందించి.. తెలంగాణ ఉద్యమానికి ఊపిరులూదారు. సాహిత్య వికాసమే పరమావధిగా 'ఉట్నూరు సాహితీ వేదిక' ను స్థాపించి అనేకమంది సృజన రంగంలోకి తీసుకొచ్చారు. 'ఉట్నూరు కవిత', 'ఉట్నూరు సాహితీ కెరటాలు' వంటి సంకలనాలను వెలువరించి అక్కడి ప్రాంత కవులు, రచయితలను ఉత్సాహ పరిచారు.. సమాజంలోని అసమానతలను తమ కవితా వస్తువులుగా ఎంపిక చేసుకుని.. కవిత్వం రాయడం ఆయన మౌలిక స్వభావం.. చిన్ననాటే "శ్రీశ్రీ మహాప్రస్థానం" తమ పాఠశాల గ్రంథాలయం నుండి తీసుకుని చదివి.. కవిత్వం పట్ల ప్రేరణ పొందిన ఆయన సహజంగానే అభ్యుదయ, ప్రగతి శీల భావ ప్రకటన పట్ల ఆసక్తి చూపడం జరిగినప్పటికీ.. ఏ 'ఇజం'కు లొంగకుండా.. 'హ్యూమనిజం'తోనే రచనలను పరిశీలించే సంకల్పంతో సాహితీరంగాన అడుగులు వేస్తున్నానని తమ మనసులోని మాట ప్రకటించడం స్వాగతించదగింది.

2016లో ఆయన 'తెలంగాణ కథకుల కథాంతరంగం' గ్రంథాన్ని వెలువరించి తెలంగాణ కథా వైశిష్ట్యాన్ని తెలియ జెప్పారు. ప్రస్తుతం ఆయన రాసిన కవిత్వ విమర్శనా వ్యాసాలను ఏర్చి కూర్చి "శతారం" పేరుతో ఓ గ్రంథాన్ని మనకందిస్తున్నారు.

గోపగాని గారు కవిత్వ విమర్శ విస్తృతికి తమవంతు బాధ్యతగా "శతారం" గ్రంథాన్ని ప్రకటించారు.. సరళత్వానికి పెద్దపీట వేస్తూ.. పదబంధ ప్రయోగంలో.. భాష విషయంలో సాధ్యమైనంత వరకు.. అందరికీ అర్థమయ్యే రీతిలో పదాడంబరాలకు పోకుండా.. గాంభీర్యా పుచ్చుకున్న అభ్యుదయ, ప్రగతిశీల భావధార మనకు కానవస్తుంది. కవి కేంద్రితంగా.. ఓ కవిని ఎంచుకుని ఓ కవిత ద్వారానో.. ఆ కవి యొక్క కవితా సంపుటి ద్వారానో.. వివిధ కవితా సంకలనాలలో లభించే కవితలను ఆధారం చేసుకుని.. వాటిని పరామర్శిస్తూ, సమీక్షిస్తూ.. విమర్శనా వ్యాసాలను తీర్చిదిద్దారు. ఆయా కవుల కవిత్వ రచనా శైలిని, ధోరణిని, దృక్పథాలను ప్రతిబింబిస్తూ ఈ వ్యాసాలను మనకందిస్తున్నారు. ఆయా కవితలు రాసిన కవుల పరిచయాన్ని సంక్షిప్తంగా పొందు పరిచి వ్యాసాలకు నిండుదనాన్ని కూర్చారు. సాహిత్యం పట్ల ఆయనకున్న అవగాహనను... సమాజం పట్ల ఆయనకున్న బాధ్యతను ఇందలి వ్యాసాల ద్వారా తెలుసుకుని ఆయనను మనం అభినందించి తీరుతాం.. అభ్యుదయ, విప్లవ సాహిత్యోద్యమాల క్రమ పరిణామంతో పాటు, దళిత, ప్రాంతీయ అస్తిత్వాల ఆవిర్భావం.. వికాసం.. విస్తృతి.. వంటి అంశాలను.. ప్రసిద్ధ కవుల రచనా శైలిని.. ఆధునిక కవితా తీరుతెన్నులను ఈ గ్రంథం ద్వారా కొంతమేరకైనా అర్థం చేసుకోగలం..

రచయిత ఆయా కవుల కవితలను.. గ్రంథాలను పరామర్శించి.. విమర్శనా వ్యాసాలు రాసే క్రమంలో తమ సహృదయతను ప్రదర్శించుకున్నారు. కవిత్వ విమర్శలో కేవల సుగుణాలను మాత్రమే చాలావరకు ప్రస్తావించారు...

చాలామంది కవులు, రచయితలు సమకాలీకులు.. పరిచయం వున్నవారేనని కాబోలు ఎంత ఆత్మీయంగా వారి వారి కవిత్వ పరిమళాలను తమ వ్యాసాల్లో గుబాళింప జేశారు.. ఆయా కవితల్లోని మంచిని పంచి మంచి పనే చేశారని భావిద్దాం.. విప్పి చెప్పేది విమర్శ కనుక.. కవిత్వ గుణదోషాలను ప్రస్తావిస్తేనే సమగ్రత అవుతుందన్న ఆలోచనను ప్రక్కన పెడితే.. విమర్శనా వ్యాసరచనలో రచయిత రవీందర్ గారు ప్రయోగించిన భాష.. పదబంధాలు అందరికీ ఇట్టే అర్థమయ్యేలా సరళంగా ఉన్నాయి.

ఇందులో కవిత్వ విమర్శనా వ్యాసాల కోసం ఎంచుకున్న గ్రంథాలు, కవితలున్నాయి.. గ్రంథ సమీక్షలను తలపించే వ్యాసాలూ ఉన్నాయి. రవీందర్ గారు తమదైన శైలిలో రచనను కొనసాగించి పాఠకులను మెప్పించారు.

'చిరస్మరణీయమైన సినారె కవిత' వ్యాసంలో సినారె కలం నుండి జాలువారిన 'మట్టి మనిషి ఆకాశం' దీర్ఘకవితను విశ్లేషిస్తూ.. మట్టిని స్థలానికి.. ఆకాశాన్ని కాలానికి ప్రతీకలుగా తీసుకుని.. స్థలానికి కాలానికి మధ్య మనిషి సాగిస్తున్న జీవన సమర ప్రవాహాన్ని చిత్రీకరించడం జరిగిందని అభిప్రాయపడ్డారు. మానవుణ్ణి వస్తువుగా గ్రహించి.. విశ్వవ్యాప్త విస్తృత నేపథ్యంలో రాయడం వలన కావ్యానికి శాశ్వత లక్షణం కలిగిందని వివరించిన తీరు బాగుంది.

సినారె 'ప్రపంచ పదులు' వ్యాసంలో సామాన్యమైన విషయాలను సైతం అసామాన్యంగా చెప్పడంలో సినారె దిట్ట అని సినారె పట్ల రవీందర్ గారు తమ గౌరవాన్ని చాటుకున్నారు.

సాహిత్యంలో కొత్త ఒరవడికి నాంది పలికిన దాశరథి కృష్ణమాచార్యులు నాలుగు దశాబ్దాల పాటు అనేక రచనలు చేసి తెలంగాణలో చిరస్మరణీయులైనారని మరో వ్యాసం ద్వారా తెలియజెప్పారు.

శ్రీశ్రీ 'జయభేరి' కవితను విశ్లేషిస్తూ.. 'నేను సైతం' అనే నుడికారంతో సమాజంలో జరిగే మార్పుల్లో సామాన్య ప్రజానీకానికి ఉన్న ప్రాముఖ్యతను వివరించారని పేర్కొన్నారు..

సిధారెడ్డి గారు రాసిన 'కలిసి ఉంటే కలదు..' కవితను చక్కగా రవీందర్ గారు పరామర్శించారు. ఈ కవితలో కవి సిధారెడ్డి గారు వ్యంగ్యాత్మకంగా ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో తెలంగాణ ప్రజలు ఎదుర్కొన్న వివక్షను గూర్చి ప్రకటించిన తీరు ప్రశంస నీయంగా ఉందనీ.. కవితను సోదాహరణంగా ప్రస్తావించారు. సిధారెడ్డి గారు తెలంగాణ ప్రజలకు రాజకీయంగా జరిగిన మోసాన్ని అందంగా ఆవిష్కరించారని తెలిపారు. కవిత్వం మాటల పొందికనే కాదు.. అది ఆలోచనలు కల్గించాలనీ.. సిధారెడ్డి గారు ఈ కవిత ద్వారా తెలంగాణ సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులను కళ్లకు కట్టినట్లుగా దృశ్యమానం చేశారని కొనియాడారు. ఈ కవిత చివరలో మాకు సుఖం / మీకు దుఃఖం అన్న చందంలా సమైక్యవాదుల తీరు ఉందని ముగించడం బాగుందని తెలిపారు. పై పంక్తుల ద్వారా వాళ్ళు ఫాంహౌజ్ పెట్టుకుంటే.. అందులో తెలంగాణవారు వాచ్‌మెన్లుగా చేరడం వంటి తెలంగాణ ప్రజల దుస్థితికి అద్దం పట్టారని వివరించారు.

మనిషి జీవనం నిరంతరం కదలికలతోనే ఉంటుందనీ.. యుగాలనుండి నేటి దాకా తనకు కావల్సిన దానికోసం పోరాటం చేస్తున్నారన్న విషయాన్ని వరవరరావు గారు రాసిన "సముద్రం" కవితను విశ్లేషించారు. మనిషి మనుగడకు ఆధారమైన వారసత్వపు ఊపిరిని తమ అక్షరానికి వరవరరావు "సముద్రం" కవితలో ఆవిష్కరించా రని అభినందించారు.

తెలుగు కవన రంగంలో అతి తక్కువ కవితల్ని రాసి తమదైన ముద్రను వేసిన కవి అజంతా గాని "స్వప్నలిపి" కవితా సంపుటిలోని కవితల్ని రేఖామాత్రంగా ఒకటి రెండింటిని ప్రస్తావించి.. కలల ప్రపంచంలో తిరగడమే కాదు.. వాస్తవంలోకి రమ్మని పిలుపునిచ్చారని విశదపరిచారు.. ద్రవిస్తున్న గడియారాలతో నిమిత్తం లేదు.. జీవన సంఘర్షణలో ఉజ్వలమైన క్షణమొక్కటే.. నిజం గ్రహిస్తున్నాను, వాస్తవం వెనుక అధివాస్తవంలో మనిషి ముఖం మీద స్వప్నలిపి చూస్తున్నా నంటూ అజంతా రాసిన కవితను ప్రస్తావించారు.

తిలక్ 'అమృతం కురిసిన రాత్రి' వ్యాసంలో తిలక్ రచనా వైచిత్రిని చక్కగా ఆవిష్కరించారు. 'అమృతం కురిసిన రాత్రి' కవితా సంపుటి నిండా అనుభూతి తొణికిసలాడే కవిత్వం ఉందన్న సంగతిని గుర్తు చేశారు.

రచయిత రవీందర్ గారు దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి "కృష్ణపక్షము" కవితా సంపుటి నుండి 'చుక్కలు' కవితను ఎంపిక చేసుకుని.. కృష్ణశాస్త్రిగారి భావకవిత్వాన్ని చక్కగా విశ్లేషించారు. ఆత్మాశ్రయం–వేదన, ప్రకృతి, విరహం, పదాల కూర్పుతో గానయోగ్యంగా రూపుదిద్దబడిన 'కృష్ణపక్షము'లోని "చుక్కలు" కవితలో ఆశకు– నిరాశకు మధ్య జరిగిన పెనుగులాటను బలంగా ఆవిష్కరించారని కొనియాడారు.

సాహిత్యంలో కొత్త ధోరణికి బాటలు వేసిన మహోన్నత వ్యక్తి శివసాగర్ అనీ.. శివసాగర్ గారి 'నెలవంక' కవితా సంపుటిలోని 'నా కోసం ఎదురుచూడు' కవితను ప్రస్తావిస్తూ.. ఆ కవితలోని ప్రతీకలను.. ఉపమానాలను.. రవీందర్ వివరించే ప్రయత్నం చేశారు.

శేషేంద్ర గారు వచన కవిత్వానికి శిల్పం అనే నూతన సౌందర్యాన్ని అద్దారనీ.. ప్రతీకలు, పదచిత్రాలు, వాక్య నిర్మాణ రీతుల్లో వైవిధ్యం.. అభివ్యక్తిలో వింత పోకడలు శేషేంద్ర ద్వారానే వ్యాప్తి చెందాయంటూ ఈ గ్రంథంలో మరో వ్యాసానికి చోటు కల్పించారు.

రామాచంద్రమౌళి గారి 'అంతర' గ్రంథంలోని 'మనిషే ఓ మహారహస్యం' కవితను మరో వ్యాసంలో విశ్లేషించారు. అంతా నిరంతరం– అనంతం.. బతకుంతా ఒక హింసా శిబిరం అంటూ చంద్రమౌళి గారు రాసిన "చిక్కుపడ్డ దారపు ఉండ" కవితలోని విశేషాలను తెలియజెప్పారు.

ఆచార్య ఎన్.గోపిగారు రాసిన 'ఫ్రీడం ఫైటర్' కవితను సోదాహరణంగా విశ్లేషించడంలో రవీందర్ గారు సఫలీకృతులైనారు. కవితావస్తువులను అతి సామాన్య మైన వాటిని ఎంపిక చేసుకుని.. సమర్థవంతంగా రాయడం గోపిగారి ప్రత్యేకత అని వివరించారు.

ఇంకా ఈ పుస్తకంలో దామెర రాములు గారి 'కొర్రాయి', 'కోరస్' గ్రంథాల్లోని కొన్ని కవితల్ని రవీందర్ గారు ప్రస్తావించిన తీరు బాగుంది. కొండి మల్లారెడ్డి గారి 'శబ్దభేరి', చెమన్ గారి కవితల్ని, జూకంటి జగన్నాథం గారి కవితా తీరుతెన్నులను, దర్భశయనం గారి కొన్ని కవితల్ని విడివిడి వ్యాసాల్లో రవీందర్ గారు వివరించే యత్నం చేశారు.

శీల వీర్రాజుగారి "ఎర్రడబ్బా రైలు" కవితను మరియు యాకూబ్ గారి 'నదీ మూలం లాంటి ఇల్లు' పుస్తకంలోని కవితల్ని విశ్లేషిస్తూ రాసిన వ్యాసాలను ఇందులో పొందుపరిచారు. జూలూరి గౌరీశంకర్ గారి 'నా నేలమీద ప్రవహించే గోదావరి', నాళేశ్వరం శంకరం గారి 'సాయుధ జలం', మట్టి వాసనలను గుబాళింపజేసే అన్నవరం దేవేందర్ గారి కవిత్వాన్ని సోదాహరణంగా విశ్లేషిస్తూ వ్యాసాలను రూపుదిద్దారు.

స్వేచ్ఛకై గళమెత్తిన కవన యోధుడు అంటూ కె.శివారెడ్డి గారిపై రాసిన వ్యాసంలో శివారెడ్డి గారి "కొంచెం స్వేచ్ఛకావాలి" కవితా సంపుటిలోని కవిత్వాన్ని విశ్లేషించారు. మనుషులంటేనే మట్టి అనీ.. శ్రమ అంటేనే మట్టితో ముడిపడి ఉంటుందని మట్టికి మనిషికి విడదీయని బంధం ఉందనీ.. మట్టిని ప్రేమించలేని వానికి బతుకు లేదని తేల్చి చెబుతూ శివారెడ్డి గారు రాసిన "కలగంటూ" కవితను మరో వ్యాసంలో రవీందర్ గారు వివరించిన తీరు బాగుంది.

శివారెడ్డిగారి 'అంతర్జనం' 'మోహన ఓ మోహన' లోని కవిత్వాన్ని విశ్లేషిస్తూ.. రాసిన వ్యాసాలు ఇందులో కొలువుదీరాయి. ఇంకా డా॥ ఎస్వీ మరియు ఇస్మాయిల్, కుందుర్తి కవితల్ని ప్రస్తావిస్తూ రాసిన వ్యాసాలకు ఇందులో చోటు కల్పించారు. "సుద్దాల హన్మంతు స్వరాలు.. సమరోత్సాహపు సవ్వడులు", "నేలపై సింగిడీలు" "వెంకన్న పాటలు", "చిన్న వీరభద్రుడి కవిత" శీర్షికలతో రాసిన వ్యాసాలు ఆసక్తి కరంగా మలచబడినాయి. అలిశెట్టి ప్రభాకర్ గారి కవితల్ని ప్రస్తావించిన తీరు బాగుంది.

కవిత్వం అందమైన వర్ణ చిత్రాలకే పరిమితం కాదనీ.. ప్రజల ఆకాంక్షలను అక్షరీకరణ చేయాలన్న సంకల్పాన్ని విమల గారు "మృగన" గ్రంథం ద్వారా నెరవేర్చుకున్నారని కొనియాడారు.

ఇంకా ఈ గ్రంథంలో.. సుద్దాల అశోక్‌తేజ గారి గీతాలను.. ప్రసేన్ గారి ధిక్కార స్వరాన్ని, విశ్లేషిస్తూ రవీందర్ గారు రాసిన వ్యాసాలున్నాయి. కదనోత్తేజానికి ప్రతీక ఉదారి గారి కవిత్వాన్ని రైతు ప్రేమికుడైన గోపిని కరుణాకర్ కవిత్వాన్ని సహృదయ కవిత్వానికి ప్రతీక అయిన ఐ.వి.సుబ్బాయమ్మ గారి కవిత్వాన్ని విశ్లేషిస్తూ రవీందర్ గారు రాసిన వ్యాసాలు ఆసక్తికరంగా తీర్చిదిద్దబడినాయి.

తెలంగాణ ప్రసిద్ధకవి డా॥ ఏనుగు నరసింహారెడ్డి గారు ఇటీవల వెలువరించిన "నీడల దృశ్యం" కవితా సంపుటిని సమగ్రంగా సమీక్షిస్తూ ఓ వ్యాసాన్ని ఇందులో పొందుపరిచారు. నర్సింహారెడ్డి గారి మాటలెంత ఆప్యాయంగా ఉంటాయో.. ఆయన కవిత్వం అలాగే ఉంటుందని కితాబునిచ్చారు. "ఆప్త వ్యాకాల కలబోత", "నీడల దృశ్యం" అని ప్రశంసించారు. "నీడల దృశ్యం"లోని కవిత్వాన్ని ఆత్మీయంగా పరామర్శించారు.

అమానవీయతపై కలమెత్తిన 'ప్రకాష్' అంటూ చలపాక ప్రకాశ్ గారి కవిత్వాన్ని రేఖామాత్రంగా పరిచయం చేశారు.

ఇంకా ఈ గ్రంథంలో ల్యాదల గాయత్రి గారి "శ్రీకారం", నూటెంకి రవీంద్ర గారి 'అతడే అలిగిన్నాడు', గాజోజు నాగభూషణం గారి 'ప్రాణదీపం' గ్రంథాలపై రాసిన సమీక్షా వ్యాసాలున్నాయి.

అనిశెట్టి రజిత గారి సంపాదకత్వంలో వెలువడిన 'జిగల్' కవితా సంకలనం, బిల్ల మహేందర్ గారి సంపాదకత్వంలో వెలువడిన "వలస దుఃఖం" కవితా సంకలనాలపై రాసిన సమీక్షలూ ఉన్నాయి.

కవి, అనువాదకులు ముకుంద రామారావు గారి 'అదే నేల' రాసిన గ్రంథాన్ని సమీక్షిస్తూ.. భిన్న భాషల, విభిన్న జీవితాల, సంవేదనల, బహుముఖీనమైన భారతీయ కవిత్వం గూర్చిన అపూర్వ గ్రంథమని కొనియాడారు.

ఇంకా ఇందులో కవిత్వామృత ధారలు కురిపింపిన కవి హాఫెజ్ గారి గజల్‌లపై రవీందర్ గారు రాసిన విశ్లేషణా వ్యాసం.. వారాల ఆనంద్ గారు తెలుగులోకి అనువదించిన గుల్జార్ కవితల్ని.. గుల్జార్ హృదయరాగాలే "ఆకుపచ్చని కవితలు" పేరుతో రాసిన మరో వ్యాసం రాసి ఈ గ్రంథానికి శోభకు కూర్చారు.

కవులకు కరదీపిక "బషోదైకూ యాత్ర" అంటూ రాసిన వ్యాసం బాగుంది.

కవి గోపగాని రవీందర్ గారు ఇలా పై వాటితో పాటు 'శతారం' గ్రంథంలో కవిత్వాయుధం 'పదునెక్కిన పాట' శీర్షికతో మరో వ్యాసాన్ని పొందుపరిచారు. జి.లక్ష్మీనరసయ్యగారి ప్రధాన సంపాదకత్వంలో వెలువడిన ఈ గ్రంథాన్ని సమీక్షిస్తూ పాట యొక్క పదునును తెలియజెప్పారు.

'కలమే మా గళం' అంటూ రవీందర్ గారు లక్సెట్టిపేటలో ఉంటూ అక్కడి ప్రాంత కవులను ప్రోత్సహిస్తూ "ఊపిరి పాట" కవితా సంకలనాన్ని తమ సంపాదకత్వంలో ప్రకటించారు. కరోనాపై సరైన అవగాహన కల్పించడానికి రవీందర్ గారు చేసిన ప్రయత్నం ప్రశంసనీయంగా ఉంది. ఈ వ్యాసంలో గ్రంథానికి సంబంధించిన సమాచారం మాత్రమే ఇచ్చారు. ఏ ఒక్క కవితనూ ప్రస్తావించలేదు.

> "మనిషి జీవనం నిరంతరం కదలికలతోనే ఉంటుందనీ.. యుగాలనుండి నేటి దాకా తనకు కావల్సిన దానికోసం పోరాటం చేస్తున్నారన్న విషయాన్ని వరవరరావు గారు రాసిన "సముద్రం" కవితను విశ్లేషించారు"

"ఆదిలాబాద్ జిల్లా వచన కవిత్వం" శీర్షికతో రాసిన వ్యాసంలో సమగ్రత కొంతమేరకు లోపించినప్పటికీ రవీందర్ గారు చేసిన కృషిని అభినందించి తీరుతాం.

"పోరు పరిమళాల కవిత్వ వంతెన" అంటూ కె.క్యూబ్‌శర్మగారి "రెప్పల వంతెన" కవితా సంకలనాన్ని సమీక్షించారు.

ప్రజా వాగ్గేయకారుడు గూడ అంజయ్య గారి గేయాలను పరామర్శిస్తూ ఆయనకు నివాళులు సమర్పిస్తూ మరో వ్యాసాన్ని ఇందులో పొందుపరిచారు.

లేదాళ్ళ రాజేశ్వరరావు రచించిన 'కందిలి' కవితా సంపుటికి రవీందర్ గారు రాసిన ముందుమాటనూ ఇందులో చేర్చడం విశేషం! 'కందిలి'లోని కవితా విశేషాలను సోదాహరణంగా విశ్లేషించారు. ఇంకా చైతన్యకిరణాలు "స్ఫూర్తి"పాటలు అంటూ కవి గాయకుడు 'స్ఫూర్తి' రాసిన పాటలను పరిచయం చేస్తూ మరో వ్యాసాన్ని పొందుపరిచారు.

ఇలా గోపగాని రవీందర్ గారు ఆయాకవుల కవిత్వంపై.. వారు వెలువరించిన గ్రంథాల్లోని కవిత్వంపై తమదైన శైలిలో విశ్లేషిస్తూ సహృదయ కవిత్వ విమర్శనా వ్యాసాలు రాశారు. ఆయన కవిత్వాన్ని విమర్శనా దృక్పథంతో చూసే క్రమంలో.. ఆయా కవితల్లోని సుగుణాలనే ప్రస్తావించడం గమనార్హం..! ఆత్మీయ కవిత్వ పరామర్శతో రూపుదిద్దుకున్న 'శతారం' అందరూ చదువదగింది. ప్రతీ గ్రంథాలయంలో ఉండదగింది.

పేజీలు:319
వెల: రూ.260/–
ప్రతులకు :
గోపగాని రవీందర్
9440979882



– దాస్యం సేనాధిపతి
9440525544

## సామాన్యుడిస్వగతం

అలవైకుంఠపురం ఉందోలేదో
ఇలనాకలి బాధలు మాత్రం ఉన్నాయి!

పుణ్యంతో స్వర్గప్రాప్తి ఉందోలేదో
రౌరవ నరకాలు మాత్రం రోజూ కనిపిస్తాయి!

మరుజన్మంటు ఉందోలేదో
ఇక్కడ ప్రతిరోజూ పునర్జన్మే!

రేపటి రోజు అందంగా ఉంటుందో లేదో
నేడు మాత్రం దగా చేస్తూనే ఉంటుంది!

కలలు నిజమవుతాయో లేదో
నిను కాసేపయినా బతికిస్తాయి!

-సి.యస్.రాంబాబు
8374818961

## జాగ్రత్తలు అవసరమే మరి

పుట్టడం మరణం ఒక క్షణం
మనం ప్రమాదపు అంచుల్లో
నిలబడి ఉన్నాం
కాదు స్వీయకృత్యాలతో
నెత్తి వేయబడుతున్నాం
మారణాన్ని కొని తెచ్చుకుంటున్నాం
లక్షలు అవసరం లేదు
లక్ష్యం గట్టిగా ఉంటే చాలు
చిన్న మాస్కుతో మూతి ముక్కు
ముసుకో ముప్పేటను ఎదురుకో
చేతులను శుభ్రం చేసుకో
కొద్ది అడుగుల జీవనం
కొంపలను కాపాడుతుంది
అశ్రద్ధ తో అవస్థలు పడకు
శ్రద్ధగా కరోన నియమాలను
నీకోసం...నీ కుటుంబం కోసం
వేరియంట్ ఏదీ అయిన
స్వీయ నియంత్రణే మనకు రక్ష
దేశానికి సురక్ష



-ఉమశేషారావు వైదీ
9440408080

## ప్రపంచ జల దినోత్సవం

కొండ కొనల నడుమ
దునుకులాడుతూ
సెలయేరులల్లో
సయ్యాటలాడుతూ
నదుల లోగిళ్లలోనా
పరుగులు పెడుతూ
సమస్తం నిండుకున్నది..!
సకల ప్రాణులకు
జీవనాధారమైనది..!!

పంటలన్నీ పురుడోసుకొనుటకు
పువ్వులన్నీ పరిమళించుటకు
మనుషులు అంతా
మనుగడ కొనసాగించుటకు
జీవులకు జీవగంజైనిది..!
జాతులను కాపాడుతున్నది...!!

నేడు మానవుని యొక్క
వికృత చేష్టలకు
ప్రకృతి పాడవుతున్నది
వానమ్మ కురువక
నీరు దిరుకలేకున్నది..!
పంటలు పండకా
కరువులేర్పడుతున్నవి..!!

కాలాల్లో మార్పులచ్చి
కాటికి పోతున్నరు
సమతుల్యత లేక
సవాళ్లు ఎదుర్కొంటున్నరు
దిన దినము బతుకంతా
గండము అవుతున్నది.!
గుక్కెడు నీళ్లు దొరుకని
రోజులు ముందుకస్తున్నది..!!

అందుకే మానవులార
మనము చేయాల్సినది
బాగున్నది..చాలా వున్నది
బొట్టు బొట్టును
ఒడిసి పట్టాలి
జలసిరిని పెంచుటకు
జాగృతం చేయాలి
నీటిని వృథా కాకుండా
ప్రకృతి పాడవకుండా
ప్రజల్లో మార్పు తేవాలి
అవగాహనను పెంచాలి
భవిష్యత్తున బతుకుకు
భరోసా పెంచుకోవాలి..!
భావితరాల వాళ్ళకి
ఆదర్శంగా నిలవాలి...!!



-పసుల.శంకర్
9542181301

## దారి మనోవేదన...!?

రుధిరంచిమ్మిన రోడ్డని పతాకశీర్షిక అంశంగా
నన్ను వేలెత్తిచూపుతూ, ఆ దుర్ఘటనల దుఃఖ
ఫలితాన్నంతా నాఖాతాలో జమచేసి నన్ను
ఆడిపోసుకోవడం దయచేసి మానండి...

వేగపుమాయలో తూగి మైకపుమత్తులో జోగి
యమపురికి దారులు నాద్వారా వేసుకుంటూ
ఆ విషాద శకలాల శోకాలను ఇళ్ళల్లోపంచుతూ
మీ నిర్లక్ష్యపు నడతకు నన్ను సాక్ష్యం చేయకండి...

మీ గాలితిరుగుళ్ళ చక్రాలకు ఇరుసును నేనని
కాలక్షేపానికి తెరలేపి కాలుగాలిన పిల్లిలాతిప్పి
తిప్పలు తెచ్చిపెట్టానని, ప్రాణాల్ని మింగుతున్న
రాకాసి పుట్టుకని పరుష పదాలతో నా మనసు
కుమిలిపోయే దూషనలపర్వానికి స్వస్తిపలకండి...

మీ తప్పిదాలకు కర్తను చేసి నన్ను దోషిగా
నిలబెట్టడం, నా గుండె అవిసిపోయేలా
అపవాదులు మోపడం తక్షణమే ఆపండి...

సహనానికీ సమానత్వానికీ తహతహలాడే
నేను, నిశ్చలరూపమైనా నిరంతర చలనాన్ని
నా రాకతోనే కదా ప్రగతి పట్టాలెక్కింది
ఊళ్ళ ఒళ్ళు సింగారపు షోకులద్దుకుంది
దూరాలు దగ్గరై రాకపోకల ద్వారబంధాల
ఇరుకుతనంతొలగి విశాలవిశ్వం దర్శనమిచ్చింది..

నా గుండెపైతంతూ తిరుగుతున్న మీపాదచక్రాల
గాట్లు వొంటినిండా గాయాల్ని చేసి సలపరం
పెడుతున్నా, చతికిల పడక మీ కోసం నేను
ఎర్రతివాచీ పరిచి కొత్తసత్తువ తెచ్చుకుంటున్న....

మీ నిత్యచైతన్య ప్రగతి రథచక్రాలను నడిపే
నన్ను మీ తోడనుకోండి, కంటి వెలుగనుకోండి
నాకోసం మీ ప్రయాణవేగాలను నిరంతరం
గమనిస్తూ ఆహ్లాద విహారాల్ని మూటకట్టుకోండి...

అదే నేకోరుకునే మీ దారిభద్రతా ఉత్సవవేడుక
అదే నాకు మీరిచ్చే విలువైన ప్రీతిదాయక కానుక....



-మంచికట్ల లక్ష్మణ్
9494800112

## మార్పుని కోరుకుందాం..!!

మిత్రమా..నచ్చింది
కోరుకోవడం తప్పుకాదు..
కోరుకున్నది దొరక్కపోతే
నైరాశ్యం ఏల
దొరికిన దానినే ప్రేమిద్దాం..

ఉన్నపళంగా
గూటికి దూరమవ్వాలనడం
హఠాత్పరిణామమే..
అది ఊహించని శరాఘాతమే..!
అంత మాత్రాన అంతా కోల్పోయినట్టేనా
ఇంతలా చింతించడమా
ఉద్యోగం మన విద్యుక్తధర్మం కాదా..
అలాంటప్పుడు కొన్ని అనివార్యాలను
ఆమోదించక తప్పదు.

అవ్వా బువ్వా.. ఏకకాలంలోనే
అంటే అందరికీ కుదరకపోవచ్చు
ప్రాతిపదిక ఏదైనా పంచేది
మన ప్రాంతంలోనే కదా

ఓ సారి సరిహద్దున వణుకుతున్న
సైనిక సోదరులను చూడు
అంతకన్నా మేలే కదా
అహోరాత్రులూ కష్టపడి ఇష్టంగా తెచ్చుకున్న
అఖిలభారత సర్వీసులూ ఉన్నాయి
దేశమంతా వాళ్లదే..
పోటీపడి సేవలందిస్తూ ఉంటారు
అంతకన్నా మెరుగే కదా..

నా ఇల్లూ..నా వోళ్ళూ
నా జాగా..నా పల్లే నా పిల్లలూ
అందరికీ ఉంటాయి కలలు
ఎక్కడి పరిసరాలనో మరెక్కడి వాళ్లనో
నా వాళ్లే అన్నంతలా ప్రేమిస్తున్నారు
అదీ కదా ప్రేమాన్విత తత్వం
భిన్నత్వంలో ఏకత్వం.!

కోట్ల మంది నిరుద్యోగులు రోడ్ల మీదే
చంద్రమండలం మీదైనా సరే
నౌకరీ దొరికితే చాలు
హత్తుకునేందుకు సిద్ధంగానే ఉన్నారు
వాళ్ళూ మనలాంటి వాళ్లే.!
జిల్లాలకు
పేర్లు మాత్రమే మారినయ్..
భౌగోళిక దూరం పెరిగిపోలేదు
అయినా..
ఇప్పుడు ప్రపంచమే ఓ కుగ్రామం..
ఎన్ని రవాణా సౌకర్యాలూ
మరెంత సమాచార సాంకేతిక విప్లవం

మన అరచేతుల్లోనే
ఆ సౌలభ్యం తోనే
మన పిల్లలని దేశ విదేశాల
దాస్యానికి పంపడం లేదూ..

ఈ మాత్రానికే డీలా పడితే ఎలా..!
మీకేం..ఎన్నైనా చెప్పొచ్చు
కోరుకున్న జిల్లాలు దొరికుంటాయ్
అనుకుంటున్నారేమో..
మా కడగండ్లని వింటే మూర్ఛిల్లుతారు.
ఏళ్లకు యేళ్లూ..
మున్నూటాయాభై రూకలతో
ఎలా వెళ్లదీసామనుకుంటారూ
ఎన్ని వేల మైళ్ళూ
మా కాళ్ళ కింద అరిగిపోలేదూ.!?

మిత్రులారా..నీరుగారిపోకండి
ఆశావహ దృక్పథాన్ని పెంచుకుందాం..
మనకోసమే ఎదిరిచూస్తున్న
ఆ పిల్లలనూ కొన్నాళ్ళు ప్రేమించి వద్దాం..
ఎప్పటికైనా..
చేరేది సొంతగూటికేగా..!
ఎందరికుంటుందీ సదవకాశం..!



-నాంపల్లి సుజాత
9848059893

## అసలైన ప్రేమ

(కథ)

సర్వాపురం జమీందారు ప్రతి సంవత్సరము తన గ్రామంలో ఉత్సవాలు జరిపించి స్వయంగా తాను కూడా వాటిలో పాల్గొనేవాడు. వాటికి స్వయంగా ఆయన పెద్ద మొత్తంలో విరాళం ఇచ్చేవాడు. మిగతాది ప్రజలు భరించేవారు .

ఆ సంవత్సరం గ్రామ ప్రజలు ఆయన వద్దకు వెళ్లిఆ ఉత్సవాల గురించి ప్రశ్నించారు? ఆయన ఎందుకో చాలా ముభావంగా ఉన్నారు . తాను ఈ సంవత్సరము విరాళం ఇవ్వలేనని ,తన మనస్సు బాగా లేదని ఆయన వారితో సూటిగా అన్నాడు.జమీందారుకు ఏమైందేమోనని వారు కంగారుపడ్డారు. వారు ఈ విషయమై ఆయన కుటుంబ సభ్యులను, బంధువులను, మిత్రులను ఎంతోమందిని ఆయనకు ఏమైందని, ఎందుకు విచారంగా ఉంటున్నారని అడిగి చూశారు. కానీ ఎవరూ ఏమీ జవాబు చెప్పలేదు. చివరకు వారు ఈ ఉత్సవాలను జరుపవద్దని తీర్మానించారు .ఇదే విషయాన్ని వారు జమీందారు వద్దకు వెళ్లి చెప్పారు.

అప్పుడు జమీందారు "నేను విరాళం ఇవ్వడం లేదనే కదా మీరు ఈ ఉత్సవాలను రద్దు చేశారు" అని అన్నాడు. అప్పుడు వారు " అదేం కాదండి!మీరు ఎందుకు విచారంగా ఉంటున్నారో తెలియడం లేదు. మీ బాధ మా బాధే.అందువలనే ఈ ఉత్సవాలను రద్దు చేశాం" అని అన్నారు.అది విన్న జమీందారు " మీరు నా విచారం గురించి నావారినందర్నీ అడిగారని నాకు తెలిసింది. మీకు నా డబ్బు పైననే ప్రేమ ఉందని నేను అనుకున్నాను. కానీ నా పైన కూడా ప్రేమ ఉందని నా మిత్రులు ,బంధువుల మాటల వల్ల తెలిసింది .మీకు నా పైన ప్రేమ ఉందో !లేదోనని నేనే ఈ నాటకం ఆడాను. ఉత్సవాలు ఘనంగా నిర్వహించండి. ఆ ఖర్చంతా నేను భరిస్తాను" అని అన్నాడు .అప్పుడు అందరూ " జమీందారుకు జై "అనుకుంటూ వెళ్లారు. వారు జై కొట్టింది ఆయన విరాళం గురించి కాదు. ఆయన పాల్గొంటున్నందుకు కాదు .ఆయనకు ఏ విచారం దిగులు లేదన్న సంగతి తెలిసి మాత్రమే.



-సంగనభట్ల చిన్న రామ కిష్టయ్య
9908554535.

## ప్రకృతి పదనిసలు

నింగి సిగలో నీలి మేఘాల మల్లెలు
నేల తానానికే మబ్బుల తపనలు
శీతల గాలికే ద్రవించి వర్షించే మబ్బులు !

నేల తల్లి ఒళ్లంత హరిత నార చీరలు
ధరణి దాహం తీర్చే నీటి నీతి నిధులు
గాలిలో ప్రాణదాత అమ్లజని ఆరాటాలు !

రవి కిరణ స్పర్శకే మొగ్గల చిరునవ్వులు
ప్రాణికోటి పొట్ట నింప నేలమ్మ పంటలు
సుగంధాలు వడ్డించే పూల పులకరింపులు !

తడి మట్టి కౌగిట్లో మొలకెత్తే విత్తులు
సాదినోడి చేత చచ్చే కోళ్లు గొర్లు మేకలు
సుఖదుఃఖ సమ్మిళిత పగలు రాత్రులు !

ఎవ్వరు నేర్పారు చిన్నారికి చిరునవ్వులు
ఎవ్వరు ప్రసాదించె అమృత చనుబాలు
ఎవ్వరు నేర్పారు కోయిలమ్మకు సరిగమలు !

సౌందర్య ప్రకృతికే అనుదిన ప్రణామాలు
భూమాత పాదాలకే మానవకోటి దండాలు
కాలగమనానికే తలవంచాలి మానవులు !

-మధుపాళీ
9949700037

## శుభకృత్ ఆగమనం

సీ.కాలచక్రమిటుల కదులుచుండిలలోన
తీరొక్కపేరున తిరుగుచుండు
దినము వారము నెల పనిబూని తిరుగగా
వత్సరంబిలవచ్చు వాసిగాను
వత్సరంబున మూడు వరుసనీ కాలముల్
వాన యెండయు చలి వచ్చుచుండు
గ్రహములు నక్షత్ర గణములు రాశులు
తిథివార యమగండ గతులుగలిగి
తే.గీ.
అరవయాకుల చక్రంబు తిరుగుచుండ
నేటకొక వత్సరము వచ్చు ధీటుగాను
ప్లవము వెడలగా శుభకృతుశవచ్చెనిపుడు
నెటులనునుండునో గద కాల మెవరికెరుక.
చం.
అరువది వత్సరంబులవి నాగకనే చరియించుగానిమే
మెరుగము నల్పమానవుమెప్పుడు నేమిటి జర్గబోవునో
కరువులు కాటకంబులను కన్పడకుండగ జేసి మమ్ములన్
దరిగొని గావుమా జనని దండమొనర్చితి స్వాగతంబిదే
కం.
ఇచ్చల నెల్లయు దీర్చెదు
పచ్చడి యతి మధుముండు పానముసేయన్
అచ్చము యమ్మృతము సమమౌ
నచ్చనివరెవరులేరు నానుడి వినుమా!.



-ఎలగందుల లింబాద్రి
7659834393

## నానీలు

కాలకూట జలం రాకతో
అంబుధి
గర్భ శోకంతో
అల్లాడుతుంది.

వలుపు
వసంతమై పూసింది
విరహం
శిశిరమైరాలింది.

గొంతు తడిపే
జలము విషకూటమైంది
రసాయన
వ్యర్థాలతో.



-చాపలమహేందర్
9949864152

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 506వ రోజు 'బస్సు కండక్టర్' అనే అంశంపై పలువురుకవులు తమ కవితలను పంచుకున్నారు. 'బస్సు కండక్టర్' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా... -సంపాదకులు



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం ఏకాంశ కవిత్వం నిర్వహణ:
-డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు, 9441046839

## రైట్ రైట్...

ప్రయాణికుల ప్రగతి చక్రం
గమ్యం చేర్చే భద్రతా రథం
రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సారథులు
ఖజానా సంచికి టికెట్ల పంచులు
ఖాకీ డ్రెస్ కోడ్ కే వన్నెల వెన్నెలలు
బస్సెక్కి దిగేదాకా ఒళ్లంతా కళ్లే
చేయెత్తిన వారికి రమ్మని స్వాగతం
అన్నా ఆపమంటే భరోసాగా బై బై
యాత్రా నిర్వహణలో నైపుణ్యం
మధ్యలో ఇబ్బందులకు పరిష్కారం
కష్టాల కావడి భుజాన మోస్తూ
ధైర్యం వీడక డ్యూటీ చేస్తూ
కృష్ణ ప్రేమలో లీనమై వరాలడగని
కుచేలుని జీవితం
సామాజిక వారియర్
ప్రయాణికుల సేవలో కొరియర్
మేక తోకకు పోటీ పడే జీతాలు
తునికి కట్టె మంట చిటపటల్లో
చెప్పుకోలేని కష్టాలు
ఎపుడూ డ్యూటీ లో రైట్ రైట్
ఎప్పుడు పడుతుందో జిందగీ రైట్ ట్రాక్



- ఏదెల్లి రాములు

## సవ్యసాచి!

అతను సవ్యసాచా?
ఉహూ!
అదిచాలా చిన్నపదం!
శతసహస్రావధాని!
రైట్ రైట్ పోనీయ్ అన్నా ..
అంటేనే బస్సు చలనం!
"స్టాప్! జర ఆపన్నా!"అంటూ
డ్రైవర్ కి సూచనలిచ్చే
స్ట్రిక్ట్ కాండక్ట్ కండక్టర్
కాన్ఫిడెన్స్
పదిచేతులు
తలచుట్టూ కళ్లు!
స్ప్రింగ్ కాళ్లు!
జనంమధ్యలో అభిమన్యుడు!
ఎక్కేదిగే జనం!
"ఏడకి?పైసల్దియ్!"
నోటితో హెచ్చరికలు
లాఘవంగా డబ్బు తీసుకుని
చేతికి టికెట్!
"ఓఅన్నో!జర ఆపు !"
తట్టలు పొరలు పలుగులతో
జబర్దస్తీగా తోసుకుని
చొరబడే శ్రామికులు!
"నీకాల్మొక్కుతా!బిడ్డా! సిల్లరలేదు"
అని బతిమాలే పెద్దమ్మ!
"ఆపన్నా జర ఆపు! గీడదిగాల"
జబర్దస్తీ చెల్లెమ్మలు!
చెవిలో స్మార్ట్ఫోన్ !
"టికెట్ టికెట్"
అని అరిచే బస్సు కండక్టర్ వైపు
కోపంగా ఓచూపువిసిరే భామలు!
"ఓఅవ్వో!ఈడకాదు నీవు దిగాల్సింది"
అని హెచ్చరిస్తూ
ఆసుపోసిన కండెలా
కుదుపులకు ఊగుతూ
కళ్ల తిరిగినా తలదిమ్మెక్కినా
చెమటలు కక్కుతూ
డబ్బు సంచీపై దృష్టి!
చెకింగ్ వారికి
డబ్బు టికెట్ లెక్కలు
లేదంటే చేతిచమురు వదులు!
కాళ్ల నొప్పులు
ఇంటిసమస్యలు
పక్కనపెట్టి
తెల్లారుతూనే బస్సులో
తోపులాటల్లో
బస్సు కుదుపులో నలిగే
శాండ్ విచ్!.

-ఎ.రాజ్యశ్రీ

## గణిత శాస్త్రవేత్త

రైట్ రైట్ రైట్ రైట్
అంటూ సదా చూపేది సవ్యదిశనే
సహన సౌందర్యానికి భాష్యం
ప్రయాణికులతో ఛలోక్తుల హాస్యం
ప్రతి రోజూ ఆప్యాయంగా పలకరిస్తూ
నిర్ణీత సమయానికి గమ్యం చేరుస్తూ
అల్లరి మూకల ఆగడాలను కట్టడి చేస్తూ
ఆడపిల్లలకు రక్షణ కల్పిస్తూ
వృద్ధులూ వికలాంగులకు సహకరిస్తూ
ఎండా వానలనకా
రాత్రి పగలు తేడా లేక
అందరితో కలుపుగోలుగా ప్రవర్తిస్తూ
ఎంతమంది ఉన్నా
ఎవరెంత దూరం వెళ్తున్నా
సమయానికి
ఎవరికెంత చిల్లరియ్యాలో ఇచ్చేస్తూ
అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ
రద్దీ ఎంత ఉన్నా
చికాకు పడక
వృత్తి నిర్వహణ సక్రమంగా చేస్తూ
చిల్లరలేకుంటే గణిత శాస్త్రవేత్తయై
ఎవరెంత తీసుకోవాలో చెప్తూ
నేర్పుతో మసలుకునే
ఓరిమి ఉన్న ఉద్యోగి.



-పత్తెం విజయ రాఖీ

## రథ సారథి

ఆర్టీసీ మహాసముద్రంలో పడిలేచే కెరటం
అటుపోట్ల ను తట్టుకొని నిలబడే దీప స్తంభం
జన పద్మవ్యూహం లోకి చొచ్చుకొని
ఒంటికాలిపై నిలబడి
డబ్బు తీసుకోవడం
చిల్లర ఇవ్వడం
టికెట్ ఇవ్వడం
సవాలక్ష సందేహాలకు
సమాధానాలు చెప్పడం
అసహనంగా ఉండే వారిని అనునయించడం
సీట్ల పంపకం
పిల్లాడి టికెట్ కై పేచీలు
అన్నీ ఛేదించి
సురక్షిత గమ్యాన్ని చేర్చి
అమ్మయ్య అనుకునే లోపు
మళ్ళీ మొదలు రెండవ ట్రిప్
ఆర్టీసీ ని ప్రగతి పథంలో
నడిపే రథ సారథులు
ఆర్థిక స్వావలంబన కు
చేయూత నిచ్చే సోదరులు



- కపిలవాయి అశోక్ బాబు

## కుటుంబ సభ్యునిలా ఆరా

టికెట్.. టికెట్.. అంటూ
బస్సంతా కలియదిరుగుతూ
స్టేజీ స్టేజీకి
టిక్కెట్లకూ డబ్బులకూ
లెక్కలు సరిచూసుకుంటూ
స్టేజీ రాగానే
ఎక్కడం దిగడం ఇబ్బంది పడే
వృద్ధులకూ దివ్యాంగులకూ
సహాయం చేస్తూ
దిగేవారికి మిగిలిన చిల్లర ఇస్తూ
ఎక్కేవారి టికెట్లపై
ఇవ్వవలసిన పైకం రాస్తూ
ప్రతివారినీ అన్నా,
అక్కా, తాతా అంటూ
వరసలతో పిలుస్తూ
ఒక్కొక్కరినీ పోల్చుకుంటూ
ప్రతిరోజూ తప్పనిసరిగా వచ్చేవారిని
రాని రోజులకు కారణమడుగుతూ
ప్రయాణికుల క్షేమ సమాచారాలను
కుటుంబ సభ్యునిలా ఆరా తీస్తూ
ఎంత విలువైన వస్తువులైనా
బస్సులో మరిచిపోతే
కౌంటర్ లో అప్పగిస్తూ
తాగి అల్లరికి ప్రయత్నించేవారికి
సమయస్ఫూర్తితో నచ్చచెప్తూ
బస్సు చోదకుడికి కుడిభుజంగా ఉంటూ
ప్రయాణికులను క్షేమంగా
వారి వారి స్టేజీల వద్ద
జాగ్రత్తగా దింపుతూ
వ్యక్తిగత ఇబ్బందులనూ చిరాకులను
ముఖంపై కనబడనీయక
నవ్వుతూ విధుల నిర్వహణ
కండక్టరన్నకు
తగినంత చిల్లర ఇచ్చి తోడ్పడాలె.



-నాగిరెడ్డి అరుణ జ్యోతి

## అసామాన్య సామాన్యుడు !

శంఖంలా విజిల్ పూరించే
కురుక్షేత్రంలో శ్రీ కృష్ణుడు !
కిక్కిరిసిన బస్సులో దూసుకుపోయే
అభినవ అభిమన్యుడు !
పొదిలో టిక్కెట్లు
వడివడిగా సంధించే
మెళుకువలెరిగిన పోరు వీరుడు !
తోలు సంచిలో కొలువైన లక్ష్మీదేవికి
అనుంగు అంగ రక్షకుడు !
రైట్,రైట్
టికెట్, టికెట్
పొడి పొడి మాటల మిత భాషి !
సంచార బస్సు రాజ్యంలో
ఎదురులేని మహా రాజు !
డ్యూటీ దిగి వెళ్లేప్పుడు
సామాన్య మానవుడు !.



- రామకృష్ణ చంద్రమౌళి

## బస్సు కి రాజు

ఆంగ్లపదాలు
అలవోకగా తెలుగు లోకి
పండితుడైనా
పామరుడైనా
పలికేవి అవే పదాలు...
ప్రయాణికుల రవాణా
నిజమైన ప్రజాసేవకుడు
బహుముఖ ప్రజ్ఞశాలి
ఆధునిక అభిమన్యుడు
పురాణ అభిమన్యుడి
పద్మవ్యూహ ఛేదన సగమే
అభినవ అభిమన్యుడి కి
కిక్కిరిసిన జనం నుంచి
తేలిగ్గా బయట పడటం తెలుసు
ప్రయాణికులు రక రకాలు
విభిన్న తత్వాలు
అందరికీ సర్దిచెబుతూ
టిక్కెట్లు ఇస్తూ
డబ్బు వసూలు చేస్తూ
డబ్బుని రక్షిస్తూ
గమ్యస్థానం రాకని చెప్పి
దించేస్తూ కొత్త వారికి బస్సు లోకి
ఆహ్వానం పలికే అవధాని..
భిన్నతత్వాల ప్రయాణికుల్ని
గొడవలులేకుండా సమాధానపరచి
ప్రశాంతంగా ఇల్లు చేరితే
ఆరోజుకి గండం గడిచినట్లే..
తను రైట్ చెబితేగాని
బస్సు కదలదనే గర్వం కూడానేమో!
గీతా సారాంశం పాలన
ప్రయాణికులతో సత్సంబంధం
సంయమనం పాటించి
సరదాగా మాట్లాడుతూ
నేర్పుగా పని చేసుకునే నేర్పరి
నేర్పుగా ఓర్పుగా
విధి నిర్వహించే
బస్సు కండక్టర్
మనకి స్ఫూర్తి



- మోటూరి శాంతకుమారి

## నిరంతర సంచారి

వీధిలో నిరంతర సంచారి
విత్తంతోనే వ్యవహారం
బస్సెక్కిన ప్రతి ఒక్కరి
గమ్యస్థాన నిర్దేశకుడు
కూర్చోవడం బహుఅరుదు
శక్తిని యుక్తిని ప్రయోగించే ధీశాలి
లెక్కల్లో పక్కా
డబ్బు దస్కంలో మదుపరి
సంబంధాల్లో ఎవరెవరో ఎక్కడెక్కడో
ప్రపంచ చరిత్ర అంతా తనవెంటే
ఇంటి వ్యవహారాలనుండి
అంతర్జాతీయ వ్యవహారాల దాకా
ప్రయాణికులు ఎక్కినప్పటినుండి దిగేదాక
వాహనచోదకునితో నిరంతర సమన్వయం
కనుమరుగవుతున్న
ఎర్ర బస్సు
పచ్చ బస్సు
దారి తప్పుతున్న ప్రజా రవాణా వ్యవస్థ
ఏ నిముషంలో ఉద్యోగానికి ఆఖరో
అను క్షణం తనువంతా కళ్లుగా కార్యనిర్వహణ
ఏ రోజు ఏ పూట ఎక్కడో విధి నిర్వహణ
చాలీచాలని జీతంతో నిరంతర పోరాటం!.



-లక్ష్మారెడ్డి పసుల

## ఓ అర్జునుడు

బస్ కండక్టర్ అని అలుసు చూపుకు
సేవా దృక్పథం చూసి మెచ్చుకో
ఓర్పును నేర్పును చూసి నేర్చుకో
సహనానికైనా
సమరానికైనా
సవ్యసాచి
ప్రయాణికులతో కలిసిమెలిసి
ఉండే తోడునీడు
సంసార బాధలన్నీ మరిచి వృత్తిలో లీనం
ఎప్పుడేం జరిగినా తొణకక
ప్రయాణం కొనసాగించే ధీశాలి
రథానికీ అర్జునునిగా
ప్రయాణరంగంలో
ముందుకు దూకే కండక్టరు.

-కాశినేని అంజన్ బాబు

## మహా విహారి

ఖాకీ వస్త్ర ధారణం
చంకలో సంచి భూషణం
శకట ప్రయాణం
చీటీ విక్రయ అధికారి విహారి
ప్రయాణికుల గమ్య స్థాన
సూచికా శిరోమణి
చిల్లర ఇస్తే మిత్రువు
లేదంటే బాకీ రుసుము చీటీ వ్రాతలు
ఇవ్వకుంటే శత్రువు
టంగు టంగుమంటూ మోగిస్తూ...
శకట చోదకున్ని వారిస్తూ
ప్రయాణికులను
వారి స్థానాలలో దింపేస్తూ...
కూర్చోక
నిలబడక
తోసుకుంటూ
మందలిస్తూ
బ్రతిమిలాడుతూ
పిల్లల తల్లుల దోబూచులాటలో
వయస్సు గణించి
వారిని గమనించి
ప్రయాణ చీటీ విక్రయించి
విధుల నిర్వహణలో
కర్కశంగా వ్యవహరించి
తనదేమో రాద్ధాంతం
సంస్థకు అభివృద్ధి కీర్తి
గుంపుల జంపుల ప్రయాణికుల
చిక్కుల రోదనల మధ్య
ప్రయాణ చీటీ పొందనివారిచే
ముప్పు శోకితుడు
తనిఖీలో జీతం కోతకు బాధితుడు.



-జె.నరసింహారావు

# సంప్రదాయ కళలను కాపాడుకోవాలి



సంప్రదాయ కళలను కాపాడుకోవాలని వక్తలు పేర్కొన్నారు. శ్రీ గాన సరస్వతి డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం త్యాగరాయ గానసభలో కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది. వైజ్‌మెన్స్ ఇంటర్నేషనల్ ఇండియా ఏరియా పూర్వ క్షేత్రాధికారి వైఎస్‌ఆర్ మూర్తి, అకాడమీ అధ్యక్షురాలు వాణి రమణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

# వంశీ స్వర్ణోత్సవ కథా సంకలనం ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ వాణీదేవి, అయాచితం శ్రీధర్, వంశీ రామరాజు, తదితరులు.

కొన్ని కథలు జీవిత కాలమంతా మనస్సును వెంటాడుతాయని శాసనమండలి సభ్యురాలు సురభి వాణీదేవి అన్నారు. వంశీ ఆర్ట్ థియేటర్స్ ఇంటర్నేషనల్, సాహితీకిరణం మాసపత్రిక ఆధ్వర్యంలో 50మంది కథకులు రచించిన వంశీ స్వర్ణోత్సవ కథా సంకలనం ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా వాణీదేవి పాల్గొన్ని గ్రంథాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. గ్రంథంలోని ప్రతి కథలో అంతర్లీనంగా ఒక సందేశంతో కూడిన ఆలోచన, ప్రేరణ కలిగిస్తుందని వివరించారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డా॥ అయాచితం శ్రీధర్ మాట్లాడుతూ సాంకేతిక మాధ్యమాలు ఎన్ని వచ్చినా పుస్తకాల విలువ తగ్గదన్నారు. శుభోదయం చైర్మన్ డా॥ శ్రీలక్ష్మీప్రసాద్, సాహితీవేత్త డా॥ ఓలేటి పార్వతీశం, గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి, రచయిత విహారి, డా॥ తెన్నేటి సుధ తదితరులు పాల్గొన్నారు. సభకు వంశీ రామరాజు స్వాగతం పలికారు. పొత్తూరి సుబ్బారావు అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముందు సుజారమణచే అన్నమయ్య కీర్తనల గానం జరిగింది.

# 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'కి ఉత్తమ న్యూస్‌రీడర్ పురస్కారం



ప్రముఖ న్యూస్ చానల్ 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'కి ఆరాధన టీవీ న్యూస్‌రీడర్స్ 2021 ప్రతిభా పురస్కారం ప్రదానం చేశారు. ఆరాధన సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం త్యాగరాయ గానసభలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ న్యూస్‌రీడర్ పురస్కారాన్ని ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' న్యూస్ రీడర్ నీలిమారాణికి బహూకరించి శుభాకాంక్షలు తెలిపారు. ఏపీ హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ జి. భవానీ ప్రసాద్ ఈ సందర్భంగా పురస్కారాన్ని ప్రదానం చేసి మాట్లాడారు. న్యూస్ చానల్‌ల న్యూస్‌రీడర్లు మంచి ఉచ్ఛారణతో వార్తలు చదువుతూ వీక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నారన్నారు. సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞశర్మ పూర్వ న్యాయమూర్తి బూర్గుల మధుసూధన్ మాట్లాడారు. ఇదే సందర్భంగా పలు ఛానల్‌లకు చెందిన న్యూస్‌రీడర్లకు పురస్కారాలను ప్రదానం చేశారు. వ్యాఖ్యాతి ఎంకేఆర్ ఆశాలత, లయన్ హనుమంతరావు, బిర్లా రాజశేఖర్‌రెడ్డి, కొత్త కృష్ణవేణి, శ్రీనివాస్, నిర్వాహకులు లోకం కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి



అంబేద్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ విశ్రాంత ఉపకులపతి ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. శిఖరం ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి త్యాగరాయ గానసభ కళా సుబ్బారావు కళావేదికలో బీఆర్ అంబేద్కర్ సమతా పురస్కార ప్రదానోత్సవం జరిగింది. విశ్రాంత పోలీస్ అధికారి సుంకర సత్యనారాయణ అధ్యక్షత వహించిన సభలో నటుడు మాగంటి ప్రసాద్ పాల్గొన్నారు. ఎం.శంకర్, రమణయ్య, రంజని తదితరులు పురస్కారాలు అందుకున్నారు. నిర్వాహకులు జి. కృష్ణ స్వాగతం పలికారు.

# సీఎం కేసీఆర్‌ను సన్మానించిన పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి..

కరీంనగర్ , ఏప్రిల్ 27తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావును రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ ఘనంగా సన్మానించారు. బుధవారం హైదరాబాద్?లోని హైటెక్స్?లో జరిగిన తెలంగాణ రాష్ట్ర సమితి ప్లీనరీ సమావేశాల సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ సభ వేదిక పైకి రాగానే కోలేటి దామోదర్ శాలువాతో సత్కరించారు.

## కీర్తి శేషులు పీచర సునీతారావు ద్వితీయ వార్షిక పురస్కారాల కోసం రచనలకు ఆహ్వానం



స్వర్గీయ శ్రీమతి పీచర సునీతా రావు పేరుతో ఈ సంవత్సరం పురస్కారాలు ఇవ్వటం కోసం పీచర సునీతా రావు అవార్డు కమిటీ కవిత్వం ,కథలు , విమర్శ (వ్యాసాలు ) మూడు విభాగాల నుండి సంపుటులను ఆహ్వానిస్తున్నది . మార్చ్ 2019 నుండి మార్చ్ 2022 మధ్య వెలువడిన రచనలే పంపించాలి. ఈ మూడేళ్ళ ముందుగాని తరువాత గాని వచ్చిన రచనలు పరిశీలించబడవు. కవిత్వం ,కథ, విమర్శలలో ఎంపికైన ప్రతి సంపుటానికి 15000 నగదు జ్ఞాపిక, శాలువా సత్కారం ఉంటుంది . టి.మన్మోహన్ రావు,ఇంటి. నెం.1-5-431/2/16/, రామేశ్వర్ నగర్. కాలనీ,జోన్నబండ ,ఓల్డ్ అల్వాల్ 500010, ఫోన్ 9848698699 కి మూడు ప్రతులు పంపించాలి. చివరి తేది **మే 18,2022.**

-పీ. విజేందర్ రావు, కాంచనపల్లి గోరా
కన్వీనర్ ,అవార్డుకమిటీ కో కన్వీనర్ అవార్డు కమిటీ

## కణిక



అడ్మిన్: రమాదేవి కులకర్ణి

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న

## 'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు



నిర్వహణ: శ్రీమతి సత్య నీలిమ వలిపే
ఈ సమూహంలో చేరదలచినవారు 8985613123కి మెసేజ్ చేయవచ్చు.

(ప్రథమ)

### నిశీధిలో నేను

దూరాన ఉంటే కలవరింపులు...
చేరువైన వేళ పన్నీటి చిలకరింపులు...
ఇరుహృదయాలు చేసుకున్న
కనుల బాసలు...
ఎడతెగక చెప్పుకున్న
ప్రేమ ఊసులు...!
సాయంసంధ్యా విహారాలు...
మాటల మల్లెల పరిమళాలు...
అనురాగ గంధాల చిరునవ్వులు...
పున్నమి జాబిలి రాత్రులు...!
ఎగతాళి నవ్వుల్లో దాగిన సరసాన్ని...
కాలక్షేపపు వాదనలో దాగిన సరదాను...
పనుల ఒత్తిడిలోని విసుగులో
కసురుకున్నా...
బ్రతిమిలాటలో చేరువైన చెలిమి చేరువను...
ఇంకా ఇక్కడే ఉన్న
నీ అంతరంగాన్ని అందలేక...!
నిశీధిలో ఒంటరి చకోరమై...
తీయని జ్ఞాపకాల అలజడిలో పరవశనై...
నీ బాహుబంధపు భావనలో బందీనై...
ఉన్నానన్న మనసులో
మాటను...
తెలిపేందుకు అడ్డుపడుతున్న
అహాన్ని తరిమి
నీకు తెలపాలని...



-చంద్రకళ. దీకొండ

(ద్వితీయ)

### నిశీధి కూడా నేర్పుతుంది

అబలగా నేను నడివీథిలో నిలబడినపుడు
నలుగురు నన్ను చూసి
హేళనగా నవ్వినప్పుడు
బ్రతకాలనే ఆశ, తెగించాలనే తెగింపు
నాలో కలుగనపుడు
గుండెల నిండా ఊపిరి కూడా తీసుకోలేని
అశక్తతతో ఉన్నపుడు
కనీసం ఆత్మహత్య కూడా చేసుకోలేని
పిరికితనం నన్నావహించినపుడు
నేనేలా ఉన్నానో తెలుసా
జీవము న్న జీవచ్ఛవంలా
అస్తిత్వం లేని అలశేశంలా
ఆవేశం లేని అగ్గికణంలా
ఆ క్షణంలో,
నడిరోడ్డులో, నిశీధిలో
కొండంత అండగా
ఆద్యంతాలు లేని భూమ్యాకాశాలు
ఇంకేం కావాలి నాకు
భూదేవి కున్నన్ని బాధ్యతలు మోసేదెవరని
ఆకాశం కన్న విశాలమైన దృక్పథం
ఎవరికుంటదని
సూర్యుని మించిన
ప్రేరణ ఎవ్వరివ్వగలరని
ప్రకృతి ని మించిన పవిత్రులు ఎవరని
వెలుగును వెలుగుగా పరిచయం చేసే
తాత్త్వికులు ఎవరున్నారని
అప్పుడు చలనం కలిగింది నాకు
ఆ క్షణమే స్పృహలోకొచ్చాను
మొలకగా చిగురించాను
మొక్కగా అవతరించాను
త్యాగ ఫలాలనిచ్చు చెట్టుగా ఎదిగాను
నాకు నేనే తరించాను.



-ప్రసూన బిళ్ళకంటి

# 'గులాబీ కవితలు' పుస్తకావిష్కరణ



ప్రతి ఒక్కరూ 'జీవితం' పుస్తకాన్ని మనసు పెట్టి చదవాలని తెలుగు సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ పేర్కొన్నారు. తెలంగాణ సాహితీ కేంద్రం ఆధ్వర్యంలో శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రముఖ కవి మాదూరి రచించిన గులాబీ కవితలు పుస్తకావిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. తెలంగాణ సాహితీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఆనందాచారి మాట్లాడుతూ కాళోజీ కవిత్వం చదివి ప్రేరణ పొందిన ప్రదీప్ మదూరి కవిత్వంలో తెలంగాణ పలకరింత, ప్రొఫెసర్ ఎస్.రఘు మాట్లాడుతూ కాళోజీ కవిత్వం చదివి ప్రేరణ పొందిన ప్రదీప్ మదూరి కవిత్వంలో తెలంగాణ పలకరింత, రాజకీయ వ్యంగ్యాస్త్రాలు ఉన్నాయన్నారు. ఉస్మానియా విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ ఎస్.రఘు మాట్లాడుతూ ప్రదీప్ కవిత్వంలో తన్మయత్వం ఉందన్నారు. కోయ చంద్రమోహన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తంగిరాల చక్రవర్తి, కవి ప్రదీప్ మదూరి, అనంతోజు మోహన్‌కృష్ణ జిల్లా నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# 'గమనం-గమ్యం' పుస్తకావిష్కరణ



భారతదేశం ఐటీ రంగానికి పుట్టినిల్లు కావాలి. విదేశాల్లోని భారతీయులు మైక్రోసాఫ్ట్ వంటి కార్పొరేట్ సంస్థలకు దీటుగా ఐటీ పరిశ్రమలను స్వదేశంలో స్థాపించాలని పద్మభూషణ్ పురస్కార గ్రహీత, శాంతా బయోటెక్ చైర్మన్ వరప్రసాదరెడ్డి ఆకాంక్షించారు. బారు శ్రీనివాసరావు నాలుగు దశాబ్దాల సాఫ్ట్‌వేర్ ప్రయాణ అనుభవాలకు అక్షర రూపా 'గమనం-గమ్యం' పుస్తకాన్ని శనివారం బేగంపేటలోని హరితప్లాజాలో వరప్రసాదరెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ పుస్తకం చదవడం ద్వారా ఐటీ రంగంపై తనకున్న దురభిప్రాయాలు తొలగాయన్నారు. టెక్ మహేంద్ర విశ్రాంత సీటీఓ, ఏఎస్ మూర్తి మాట్లాడుతూ 'గమనం-గమ్యం' ఎంబీఏ విద్యార్థులకు అనధికార పాఠ్యాంశంగా అభివర్ణించారు. ప్రఖ్యాత సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో వివిధ హోదాలో సుదీర్ఘకాలం పనిచేసి, ఆ అనుభవాలను పుస్తకంగా రాయడం అభినందనీయమని ప్రముఖ రచయిత అంపశయ్య నవీన్ ప్రశంసించారు. కార్యక్రమంలో ఆంధ్రభూమి ఎడిటర్ ఏఎస్‌లక్ష్మి, సాఫ్ట్‌వేర్ రంగ నిపుణులు పూర కృష్ణమూర్తి, విశ్రాంత ఐటీ కార్యదర్శి జె. సత్యనారాయణ, కొమ్రరాజు రవిశంకర్, మహేంద్రా లా యూనివర్సిటీ డీన్ మాడభూషి శ్రీధర్, సినీ నటుడు ప్రదీప్ పాల్గొన్నారు.

# సీఎం కేసీఆర్ కు థ్యాంక్స్ చెప్పిన కాంగ్రెస్ ఎమ్మెల్యే సీతక్క

హైదరాబాద్, ఏప్రిల్ 27:ప్రభుత్వం అమలు చేస్తున్న దళిత బంధును లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ములుగు ఎమ్మెల్యే సీతక్క సూచించారు. జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవ సహకార అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో దళిత బంధు లబ్ధిదారుల అవగాహన సదస్సులో ఎమ్మెల్యే సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లబ్ధిదారులు దళిత బంధును సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి ఒక్కరూ ఎంచుకున్న యూనిట్ ద్వారా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ప్రతిపక్ష ఎమ్మెల్యే అని భేదం లేకుండా ఎలాంటి వివక్షత లేకుండా తమ నియోజక వర్గానికి 100 మంది లబ్ధిదారుల ఎంపికకు సహకరించిన ముఖ్యమంత్రి కెసిఆర్ కి, ఇంఛార్జి మంత్రి సత్యవతి రాథోడ్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ములుగు నియోజకవర్గానికి ఇంకా 2000 వేల మంది దళితులకు దళిత బందు ఇవ్వాలని సీతక్క కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా,మండల అధికారులు జెడ్పీటీసీలు ఎంపీపీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


ఆహ్వానం
గోల్కొండ సాహితీ కళా సమితి
ఆధ్వర్యంలో



'తెలంగాణ వైతాళికుడు, గోల్కొండ పత్రిక సంపాదకులు'
సురవరం ప్రతాపరెడ్డి గారి 126వ జయంతి
సందర్భంగా
కవితలకు ఆహ్వానం
అంశం : 'సురవరం మన వరం' - సురవరం జీవితం, సాహిత్యం, సామాజిక సేవ
(కవిత, పద్యం, పాట మొదలైన కవితా ప్రక్రియలలో)
కవితలు 16 పంక్తులు మించకుండా, పద్యాలు 4 పద్యాలు మించకుండా ఉండాలి
ఈ కార్యక్రమం 2022 మే నెల చివరి వారంలో ఉంటుంది.
కవితలను పంపాల్సిన చివరి తేది : 10-05-2022
కవితలు పంపాల్సిన వాట్సాప్ నెం : 95027 07093
గమనిక : పుస్తక ఆవిష్కరణ, కవిసమ్మేళనం తేదిని మీకు త్వరలోనే తెలియజేస్తాము.
ఇట్లు
గంట మనోహర్ రెడ్డి - గోల్కొండ సాహితీ కళాసమితి ఉపాధ్యక్షులు
డా. చంద్రప్రకాశ్ రెడ్డి - గోల్కొండ సాహితీ కళాసమితి అధ్యక్షులు


# సిరి మల్లెలు పుస్తకావిష్కరణ




ప్రతి పాఠశాల గ్రంథాలయంలో విద్యార్థులకు అందుబాటులో ఉండదగిన పుస్తకం "సిరి మల్లెలు" అని పెద్దపల్లి జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీమతి మాధవి గారు అన్నారు. ధర్మారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నర్సింహుల పల్లెలో తెలుగు భాషోపాధ్యాయుడిగా పనిచేస్తున్న కందుకూరి భాస్కర్ రాసిన సిరిమల్లెలు పుస్తకాన్ని వారు పెద్దపల్లిలో ఏప్రిల్ 21 న ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యాశాఖాధికారి మాట్లాడుతూ ఇందులో పాఠశాలలో జరుపుకునే ముఖ్యమైన దినోత్సవాల ప్రాధాన్యతను తెలుపుతూ రాసిన పాటలున్నాయని అన్నారు. జూన్ 2 తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం మొదలుకొని పాఠశాల వార్షికోత్సవ వేడుకల వరకు వివిధ సందర్భాలను పురస్కరించుకొని రాసిన ఈ పాటలు విద్యార్థులు పాడుకోవడానికి వీలుగా, సరళమైన భాషలో ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారులు సురేందర్ కుమార్, సంపత్ రావు, ఛాయాదేవి, లక్ష్మి , కవిత, రాజయ్య, నర్సింహుల పల్లె పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.వి. సత్యనారాయణ, కవి, రచయిత తెరవే రాష్ట్ర కార్యదర్శి కూకట్ల తిరుపతి, డిసిఇబి సెక్రటరీ హన్మంత్ , ఏసిజిఇ రాంరెడ్డి మరియు వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత కందుకూరి భాస్కర్ కు పలువురు ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలియజేశారు.


అందరికీ ఆహ్వానం
శ్రీశ్రీ సాహిత్యం శ్రీశ్రీపై సాహిత్యం
రెండో నూరుపుస్తకాల హోరు



119, 120, 121, 122, 123, 124, 125 ప్రచురణలు
శ్రీశ్రీ ప్రపంచం-1, శ్రీశ్రీ ప్రపంచం-2
తిక్కన సోమయాజి, శ్రీశ్రీ కవిత్రయం,
మరో ప్రపంచకవి, స్మృతిరంగంలో శ్రీరంగం,
శ్రీశ్రీ గురించి.. 7 పుస్తకాల
ఆవిష్కరణ
30-04-2022 ఉదయం 9 గంటలకు
విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో
మహాకవి శ్రీశ్రీ విగ్రహం వద్ద
శ్రీశ్రీ సాహిత్యం, శ్రీశ్రీపై సాహిత్యం
2 వేల రూ.లకు,5 వేల రూ.ల 100 పుస్తకాలు
'రెండో నూరు పుస్తకాల హోరు'ప్రణాళికలో చేరండి
Sri Sri Sahityanidhi .. Handline : 92462 77375 :: :: E.mail : srisri_sahityanidhi@yahoo.com



Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com